www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 23 జనవరి 2025
సంపుటి :06 సంచిక : 235 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు
# ఎమ్మెల్యే శంకుస్థాపన..

**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 22:**
ఆదిలాబాద్ మున్సిపల్ అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులు తెప్పించి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈరోజు ఎమ్మెల్యే TUFIDC నిధులతో మున్సిపాలిటీలో లోని దుర్గ నగర్ కాలనీ లో సైడ్ డ్రైన్ కి భూమి పూజ చేయడం జరిగింది.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్టం లోనే ఆదిలాబాద్ నియోజకవర్గన్ని ఆదర్శ నియోజకవర్గం గా తీర్చిదిద్దడమే లక్ష్యం అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అనంతరం కాలనీ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రఘుపతి. రజన్న. సుదకర్. తదితరులున్నారు

# హైదరాబాద్ లో నూతన టెక్ సెంటర్ ఏర్పాటు

- సీఎం రేవంత్ రెడ్డి

- దావోస్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ తో భేటీ అయిన ఎచ్ సి ఎల్ టెక్ గ్లోబల్ సిఈఓ విజయ్ కుమార్



2 లో..

# రవాణా రంగంలో పెట్టుబడులకు అవకాశం

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో హైదరాబాద్ అభివృద్ధి
- ఫ్యూచర్ సిటీలో అత్యుత్తమ మొబిలిటీ వ్యవస్థ
- జీహెచ్ఎంసీ పరిధిలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు
- తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు డ్రై పోర్టు

## దావోస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పెట్టుబడులను ఆహ్వానించిన రేవంత్

**దావోస్,జనవరి22 వెలుతురు:**
రవాణా రంగంలో పెట్టుబడులకు ముందుకు రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం, సీఐఐ, హీరో మోటార్ కార్ప్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానించారు. రాష్ట్ర ప్రజలు తక్కువ ఖర్చుతో.. వేగంగా ప్రయాణించాలనేది ప్రభుత్వ ఆకాంక్ష అని వివరించిన సీఎం.. అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. విద్యుత్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్



2 లో..

## అర్హులైన చివరి లబ్ధిదారుడు వరకు
# సంక్షేమ పథకాల అమలు

- త్వరలో రేషన్ కార్డుల ద్వారా ప్రతి లబ్ధిదారుడికి 6 కిలోల సన్నబియ్యం సరఫరా
- పథకాల అమలు పట్ల ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదు
- పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ ప్రజలు ఆందోళన చెందవద్దు
- దరఖాస్తులు సమర్పణ కు చివరి తేదీ ఏమీ లేదు,అపోహలు, తప్పుడు వార్తలు నమ్మవద్దు
- గ్రామ సభలలో పెట్టే ప్రాథమిక జాబితా మంజూరు పత్రం కాదు, కేవలం దరఖాస్తుల స్వీకరణ జాబితా మాత్రమే
- రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్

## రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో జనవరి 22:**
రాష్ట్రంలోనే చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.బుధవారం రాష్ట్ర నీటి పారుదల , పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లతో కలిసి రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు, రైతులకు, రైతు కూలీలకు, నిరుద్యోగులకు , పేదలకు ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం స్వతంత్ర భారతదేశంలో మేలు చేయలేదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, గత 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడు ఈ స్థాయిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కేవలం 40 వేల కార్డులు మాత్రం అందించారని మంత్రి అన్నారు. జనవరి 26 నాడు ప్రారంభించి రాష్టంలో అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డు వచ్చే వరకు ప్రక్రియ కొనసాగుతుందని, రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, ప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తు చేసిన, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసినా, గ్రామ సభలలో దరఖాస్తు ఇచ్చిన విచారించి అర్హత మేరకు కార్డులు

2 లో..

## చారిత్రాత్మక నిర్ణయానికి
# రేపు శ్రీకారం

- కరీంనగర్ లో 2,660 ఇండ్లకు ఇకపై ప్రతిరోజు 24 గంటలపాటు మంచి నీళ్ల సరఫరా
- తెలుగు రాష్ట్రాల్లో రోజంతా మంచినీరందించే నగరంగా రికార్డు సృష్టించనున్న కరీంనగర్
- ముఖ్యఅతిథిగా రానున్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్
- కరీంనగర్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, మేయర్ సునీల్ రావు





**కరీంనగర్ వెలుతురు జనవరి 22:**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజంతా మంచి నీళ్లను సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ సునీల్ రావు ఈ దిశగా తొలి అడుగు వేయబోతున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా కరీంనగర్ లోని హౌజింగ్ బోర్డు కాలనీ పరధిలోని 2,660 ఇండ్లకు ఇకపై ప్రతిరోజు 24 గంటలపాటు తాగునీటిని సరఫరా చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు దేశంలోని ఒకటి, రెండు పట్టణాల్లో మాత్రమే ఇటీవల 24

2 లో..

# ఇంకెన్నాళ్లు ఇలా దరఖాస్తుల జాతర

- ఎన్నిసార్లు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలి
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

2 లో..



**సిద్దిపేట,జనవరి22 వెలుతురు:**
దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు ఎందుకు పోసుకుంటున్నారు? ప్రజల డబ్బులు ఎందుకు వృధా చేస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు ప్రశ్నించారు. ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టాలి?

# నిజమైన అర్హులను ఎంపికకు గ్రామ సభలు

- మొదటి జాబితాలో పేర్లు రాని వారు ఈ సభల్లో నమోదు చేసుకోవచ్చు
- వాటి ఆధారంగా వెంటనే అర్హులను గుర్తించి పథకాలు ఇస్తాం
- ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ
- తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వెలుతురు ఖమ్మం/నేలకొండపల్లి జనవరి 22:**
నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకే మళ్ళీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి

2 లో..

## తెలుగు రాష్ట్రాలకు పలువురు న్యాయమూర్తులు

- తెలంగాణకు నలుగురు.. ఏపికి ఇద్దరు కేటాయింపు

2 లో..



# అప్పుడు ఐటి...ఇప్పుడు ఎఐ

- ఏఐ యూనివర్సిటీలో భాగస్వాములు కండి
- బిల్‌గేట్స్‌ను కోరిన సిఎం చంద్రబాబు
- ఎఐ ఆధారిత అభివృద్దిపై ఇద్దరు చర్చలు

**దావోస్,జనవరి22 వెలుతురు:**
గేట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలకు ఏపీని గేట్‌వేగా నిలపాలని ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు దావోస్ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ మాజీ సీఈవో బిల్‌గేట్స్‌తో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని సీఎం కోరారు. ఏపీలో ఏర్పాటు చేయబోతున్న వరల్డ్ క్లాస్ ఏఐ యూనివర్సిటీ సలహామండలిలో భాగస్వాములు కావాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు మైక్రో సాఫ్ట్ పెట్టడంతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయా యని

10 లో..



## గణతంత్ర వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు

అతిథిగా వస్తున్న ప్రబోవో సుబియాంటో



2 లో..

# నేటితో బేటీ బచావో, బేటీ పడావోకు పదేళ్లు

- ట్విటర్ వేదికగా భావోద్వేగానికి లోనైన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ,జనవరి22 వెలుతురు:**
ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'నేటితో బేటీ బచావో, బేటీ పఢావో ఉద్యమానికి పదేళ్లు పూర్తవుతాయి. గత దశాబ్ద కాలంలో ఇది ఒక కీలక పరివర్తన, ప్రజల-ఆధారిత చొరవగా మారింది. అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని పొందిందని' ప్రధాని



2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## హైదరాబాద్ లో నూతన టెక్ సెంటర్ ఏర్పాటు




(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 22:**
ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ (హెచ్సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ ) హైదరాబాద్‌లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ,హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సి.విజయకుమార్ తో జరిపినచర్చలుఫలవంతమయ్యాయి. హెచ్‌సీఎల్ కొత్త సెంటర్లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్సీఎల్ టెక్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఈ క్యాంపస్ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ కూడా అందుకుంది. ఈ కొత్త సెంటర్ ఏర్పాటుతో దాదాపు 5,000 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభించనున్నాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్‌సీఎల్ గ్లోబల్ నెట్ వర్క్ సెంటర్‌గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ అభిప్రాయపడ్డారు. వచ్చే నెలలో ఈ కొత్త సెంటర్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి ని ఐటీ శాఖ మంత్రి ని ఆహ్వానించారు. రాష్ట్రంలో హెచ్‌సీఎల్ టెక్ సేవల విస్తరణ చేపట్టడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్‌లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఐటీ పరిశ్రమను ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించాలని, అందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారాన్ని అందిస్తామని హెచ్‌సీఎల్ టెక్ ప్రతినిధులకు తెలిపారు. 2007 నుంచే హెచ్‌సీఎల్ టెక్ హైదరాబాద్ నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు సేవలను అందిస్తోంది. కొత్త కేంద్రంతో హైదరాబాద్ లో హెచ్?సీఎల్ మొత్తం అయిదు సెంటర్లనువిస్తరించనుంది.

# చారిత్రాత్మక నిర్ణయానికి రేపు శ్రీకారం

గంటలపాటు తాగునీటి సరఫరా ఇచ్చే కార్యక్రమాలు ప్రారంభయ్యాయి. చండీగఢ్ లోని మణిమజ్రా పట్టణంలో గత ఏడాది ఆగస్టులో 24/7 గంటలపాటు తాగునీటిని సరఫరా చేసే కార్యక్రమాన్ని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోని ఏ పట్టణంలో కూడా 24 గంటలపాటు నిరంతరాయంగా మంచి నీటిని సరఫరా చేస్తున్న దాఖలాల్లేవు. కరీంనగర్ ఆ రికార్డును సాధించబోతోంది.

శుక్రవారం రోజున (ఈనెల 24న) కరీంనగర్ కార్పొరేషన్ లో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు డివిజన్లో 4,055 ఇళ్లకు 24 గంటల పాటు తాగునీటిని అందించాలనే ఆశయం నెరవేరడానికి అంకురార్పణ జరగబోతోంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముఖ్యఅతిథిగా రానున్నారు. ఈ సందర్భంగా ఖట్టర్ 2,200 ఇళ్లకు 24 గంటల పాటు తాగునీటిని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆ తరువాత కొద్దిరోజుల్లోనే హౌజింగ్ బోర్డులో పరిధిలోని 4,055 ఇండ్లకు నిరంతరాయంగా మంచి నీళ్లు సరఫరా కానున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో నగర మేయర్ సునీల్ రావు ఆధ్వర్యంలో రూ.18 కోట్ల వ్యయంతో చేపట్టిన నిరంతరాయ మంచి నీటి సరఫరా పనులన్నీ పూర్తయ్యాయి. తద్వారా తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కువ ఇళ్లకు 365 రోజులపాటు తాగునీటిని అందించిన కరీంనగర్ కార్పొరేషన్ కు దక్కబోతోంది.

దీంతోపాటు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కూడా మనోహర్ లాల్ ఖట్టర్ ప్రారంభించబోతున్నారు. అందులో భాగంగా అంబేద్కర్ స్టేడియంలో రూ.22 కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, అనుబంధ పనులను, రూ.8.2 కోట్లతో మల్టీపర్పస్ స్కూల్ లో చేపట్టిన పార్క్ పనులను, రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన రాజీవ్ పార్క్ అభివృద్ధి పనులను, నగరంలోని ఆంబోతు వీర్యం కేంద్రం వద్ద పద్మా నగర్ లో రూ.14 కోట్లతో నిర్మించిన 'ఇంటిగ్రేటెడ్ మార్కెట్' భవనాన్ని, రూ.10.2 కోట్లతో నిర్మించిన స్మార్ట్ క్లాస్ రూమ్ ను, సుభాష్ నగర్ పాఠశాలలో రూ.10.2 కోట్లతో నిర్మించిన స్మార్ట్ డిజిటల్ క్లాస్ ను కేంద్ర మంత్రులు ఖట్టర్, బండి సంజయ్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

మరోవైపు కరీంనగర్ బైపాస్ రోడ్డు వద్దనున్న డంప్ యార్డ్ తో స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజల పడుతున్న ఇబ్బందులను దూరం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంకల్పించారు. అందులో భాగంగా ఎల్లుండి కరీంనగర్ కు వస్తున్న మనోహర్ లాల్ ఖట్టర్ ను డంప్ యార్డ్ ను సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా డంప్ యార్డ్ నుండి ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధిగమించేలా కేంద్ర మంత్రులు ఒక ప్రకటన చేసే అవకాశాలున్నాయి.

దీంతోపాటు తొలిసారి హర్యానా మాజీ సీఎం, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కరీంనగర్ వస్తుండటంతో... హౌజింగ్ బోర్డు కాలనీలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా హాజరుకానున్నట్లు అధికార వర్గాలు తెలిపారు. మరోవైపు కరీంనగర్ సమగ్ర అభివృద్ధి కోసం మరిన్ని ప్రణాళికలను రూపొందించిన బండి సంజయ్, సునీల్ రావు వీటి అమలు కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహకారం కోరనున్నట్లు సమాచారం.

## తెలుగు రాష్ట్రాలకు పలువురు న్యాయమూర్తులు

**న్యూఢిల్లీ,జనవరి22 వెలుతురు:**
తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు పలువురు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను బుధవారం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. అందులోభాగంగా తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ రేణుక ఎర్రా, జస్టిస్ నర్సింగరావు నందికొండ, జస్టిస్ తిరుమల దేవి ఎడ, జస్టిస్ మధుసూధనరావు బొబ్బిలి రామయ్యలను నియమించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు.. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావులను నియమించింది. తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు పలువురు న్యాయమూర్తులను ఎంపిక చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమైంది. అందుకు పలువురు న్యాయమూర్తుల పేర్లను కేంద్రానికి సిఫార్స్ చేసింది. వీరి నియమాకానికి సంబంధించి.. ఈ రోజు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 28 మంది న్యాయమూర్తులే ఉన్నారు. ప్రస్తుతం కొలీజియం సిఫారసు చేసిన ఇద్దరూ వస్తే ఆ సంఖ్య 30కి చేరుతుంది. మరో ఏడుగురు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే తెలంగాణ హైకోర్టులో పలు ఖాళీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నలుగురు న్యాయమూర్తుల పేర్లను సిఫార్స్ చేశారు. వీరు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు.

# అర్హులైన చివరి లబ్ధిదారుడు వరకు సంక్షేమ పథకాల అమలు



మంజూరు చేస్తామని అన్నారు.
గ్రామ సభలో ప్రకటించే ప్రాథమిక జాబితాలో పేరు లేని పక్షంలో దరఖాస్తు సమర్పిస్తే అర్హతను పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు మండల కేంద్రాలు మున్సిపాలిటీలలో ఉన్న ప్రజాపాలన కేంద్రాలలో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రస్తుతం దొడ్డు బియ్యం సరఫరా అవుతున్నాయని, వీటిని చాలా మంది తినడం లేదని, నూతన రేషన్ కార్డుల జారీ తరువాత ప్రతి ఒక్కరికి 6 కీలోల నాణ్యమైన సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తామని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో సాచురేషన్ పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మించామని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోసారి ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే సొంత ఊరు కాబట్టి ఇక్కడ 100 శాతం అర్హులకు మొదటి దఫా లోనే ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. ప్రస్తుతం సొంత జాగా ఉండి ఇండ్లు లేని వారికి 5 లక్షల రూపాయలు అందిస్తున్నామని, ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి 6 లక్షల సహాయం అందజేయ బోతున్నామని మంత్రి అన్నారు. రైతు భరోసా కింద రైతులకు అందే సహాయం 20 శాతం పెంచి ఎకరానికి 12 వేల రూపాయలు అందజేస్తామని, వ్యవసాయ యోగ్యమైన భూమికి పంట వేసిన వేయకుండా రైతు భరోసా అందుతుందని ఉత్తమ్ అన్నారు.
భూమిలేని కూలీలకు స్వతంత్ర భారతదేశంలో ఎక్కడ లేని విధంగా రైతు కూలీల కుటుంబాలకు 12 వేల రూపాయలు ఇస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ నాలుగు పథకాలను గ్రామసభలు నిర్వహించే ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి జనవరి 26 నుంచి అమలు చేస్తామని, అర్హులైన చివరి వ్యక్తి వరకు లబ్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, గ్రామ సభలలో ప్రతిపక్ష పార్టీ నాయకులు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని కోరారు. జనవరి 26 నుంచి ప్రారంభించి అర్హత ప్రకారం రేషన్ కార్డులను అందరికీ జారీ చేస్తామని మంత్రి ప్రభాకర్ అన్నారు.
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి గ్రామ ప్రజలు తమ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించాలని చేసిన కృషి ఫలితంగా తాను నేడు ఎమ్మెల్యే అయ్యానని అన్నారు. 43 వేల 100 ఎకరాలకు సాగు నీరు అందించే రుద్రమ్మ ప్రాజెక్టు ను మొదటి ప్రాధాన్యత లో పెట్టామని, ఈ పనులను త్వరలో ప్రారంభం అయ్యేలా చూడాలని ఆయన మంత్రిని విజ్ఞప్తి చేశారు. రుద్రంగి మండలం మానాల లో పాత చెరువు కొత్త చెరువుకు లిఫ్ట్ అందించే త్రాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉండవని , మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం అందించారు. ప్యాకేజీ 9 లో మలక్ పేట్ రిజర్వాయర్ లో టీఎంసి నీళ్లు నింపామని, 25 కోట్లు విడుదల చేస్తే అప్పర్ మానేరు కు నీళ్లు తీసుకుని వెళ్ళవచ్చని , ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేయాలని ప్రభుత్వ విప్ కోరారు. వేములవాడ, తిప్పా పూర్, కథలాపూర్ బస్టాండ్ ఆధునికరణ కు నిధులు మంజూరు చేయాలని రవాణా శాఖ మంత్రిని కోరారు.
జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రంలో ప్రాథమికంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 103 , రైతు భరోసా క్రింద 1927 , నూతన రేషన్ కార్డుల కోసం 802, ఇందిరమ్మ ఇండ్ల కోసం 1375 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. గతంలో సాంకేతిక కారణాల వల్ల వివరాలు, దరఖాస్తుల సమర్పించని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హత మేరకు పథకాలు అమలుకు చర్యలు చేపట్టామని అన్నారు.అనంతరం మంత్రులు కలికోట - సూరమ్మ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసి, ప్రాజెక్ట్ పరిధిలోని భూములకు సాగునీటిని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన ఇతర పనులకు అన్ని నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, కో ఆపరేటివ్ చైర్మన్ మోహన్ రెడ్డి సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు,

## రవాణా రంగంలో పెట్టుబడులకు అవకాశం

ఛార్జీలు రద్దు చేసినట్లు వివరించారు. దేశంలో అత్యధిక ఈవీ వాహనాల విక్రయాలు తెలంగాణలోనే జరుగుతున్నాయన్నారు. మొబిలిటీతో పాటు.. పర్యావరణ అనుకూల వ్యవస్థలు అవసరమని, అందుకే జీహెచ్ఎంసీ పరిధిలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో డ్రైపోర్టును నిర్మించి వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దు తున్నామన్నారు. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు డ్రై పోర్టుకు సమీపంగా ఉండే ఏపీలోని మచిలీపట్నం పోర్టుకు ప్రత్యేకంగా రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధానం చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. నగరాల అభివృద్ధికి, భవిష్యత్తుకు అర్బన్ మొబిలిటీ పునాది వంటిదన్నారు. తక్కువ ఖర్చు, వేగంగా చేరుకునే రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయని సీఎం అన్నారు. కోటీ 20 లక్షలకు పైగా జనాభా ఉన్న హైదరాబాద్ లో దాదాపు 100 కిలోమీటర్లకు పైగా కొత్తగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్ ను అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ను ప్రపంచంలోనే అత్యంత వేగవంత మైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని అందరినీ ఆహ్వానిస్తున్నాం. తక్కువ ఖర్చుతో ప్రజలు వేగంగా ప్రయాణించాలన్నది మా ప్రభుత్వ ఆకాంక్ష. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుంది. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. పర్యావరణహితంగా హైదరాబాద్ ను నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలనేది మా అభిమతం. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశాలు హైదరాబాద్లో ఉండాలని కోరుకుంటున్నాం. ఎలక్ట్రిక్ వెహికిల్స్ పై మేము ప్రత్యేక దృష్టిని సారించాం.ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశాం. భారత దేశంలోనే ఈవీ వాహనాలు అత్యధికంగా అమ్ముడు పోయే రాష్ట్రం తెలంగాణ అన్నారు. మొబిలిటీ ఒక్కటే అన్నింటికీ పరిష్కారం కాదు. ఇప్పుడున్న పరిస్థితులను పర్యావరణ అనుకూలంగా మార్చాల్సిన అవసరం ఉంది. అందుకే గ్రేటర్ హైదరాబాద్ సిటీలో ప్రజా రవాణా వ్యవస్థలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నాం. తెలంగాణ డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌజ్ హబ్ గా తీర్చిదిద్దుతున్నాం. తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తాం. నగరాల అభివృద్ధికి, వాటి భవిష్యత్తుకు అర్బన్ మొబిలిటీ భవిష్యత్తుకు పునాది. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో చేరుకునే రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయి.హైదరాబాద్ నగరంలో 1.2 కోట్లకు పైగా జనాభా ఉంది. దాదాపు 100 కిలోమీటర్లకు పైగా కొత్తగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నాం. ఇప్పుడున్న దానికంటే ఇది రెండింతలు ఎక్కువ. నేను నా బృందంతో కలిసి జ్యూరిచ్ నుంచి దావోస్ కు రైలులో ప్రయాణించాం. అదొక అందమైన అనుభూతిని కలిగించే ప్రయాణం. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ మేరకు ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నాం. ఆ రెండు రింగ్ రోడ్లను కలుపుతూ రేడియల్ రోడ్లు కూడా నిర్మిస్తాం. రింగ్ రోడ్లకు అనుబంధంగా రింగ్ రైల్వే లైను నిర్మించాలనే ఆలోచనలున్నాయి.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అర్బన్ మొబిలిటీపై నా అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఇచ్చినందుకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ కు కృతజ్ఞతలు అని అన్నారు.

## ఇంకెన్నాళ్లు ఇలా దరఖాస్తుల జాతర

దరఖాస్తు పెట్టిన ప్రతిసారి 30, 40 రూపాయలు ఖర్చు అవుతుందని, ప్రజాపాలనలో అప్లికేషన్ పెట్టాం, మీ సేవలో అప్లికేషన్ పెట్టాం, ఇప్పుడు మళ్లీ గ్రామసభల్లో అప్లికేషన్ పెట్టుకున్నామని ప్రజలు అంటున్నారని, ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్ లైన్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆన్ లైన్ దరఖాస్తులు కట్టగట్టి పక్కకు పడేయడం వల్ల మళ్ళీ మళ్ళీ దరఖాస్తులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. సిద్దిపేట పట్టణం గాడిచర్లపల్లి 15వ వార్డ్ లో నిర్వహించిన గ్రామ సభలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. నిర్బంధాల మధ్య గ్రామసభలు నిర్వహిస్తున్నారని, ఎలక్షన్ల ముందు అందరికీ పరమాన్నం పెడుతామన్నారని, ఇప్పుడు అందరికీ పంగనామాలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలని హరీష్ రావు నిలదీశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వాన్ని చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఎగవేతల సిఎం రేవంత్ రెడ్డి, కోతల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కోతలు ఎన్నికల తర్వాత ఎగవేతలు అని చురకలంటించారు. రేవంత్ రెడ్డికి నిజాయితీ ఉంటే, చిత్తశుద్ధి ఉంటే యాసంగి వానకాలానికి కలిపి రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి ఐదు లక్షల ఇల్లు కడతామని హామీ ఇచ్చారని, ఏడాది పూర్తయిందని ఒక్క ఇల్లయిన ప్రభుత్వం కట్టిందా? అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇల్లులే తప్ప కట్టిన ఇళ్ళు లేవని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎస్సి, ఎస్టిలకు ఇల్లు కట్టుకునేందుకు ఆరు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కోటిమంది కూలీలు ఉంటే కోతలు పెట్టి ఆరు లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వడం సరికాదన్నారు. ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల రూపాయలు బాకీ పడిందని, 13 నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి అవ్వాతాతలకు 4000 పెన్షన్ ఎప్పుడు ఇస్తావని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా వానకాలం, యాసంగికి కలిపి 15వేల రూపాయలు ఇవ్వాలని కోరుతున్నామని, వ్యవసాయ కూలీలందరికీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలన్నారు.

## నిజమైన అర్హులను ఎంపికకు గ్రామ సభలు



పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు పాలేరు నియోజవర్గంలోని నేలకొండపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి ప్రసంగించారు. గతంలో జరిగిన గ్రామ సభల్లో దరఖాస్తు ఇచ్చి ప్రస్తుతం ఈ నెల 26 నుంచి అమలు కాబోతున్న నాలుగు పథకాల జాబితాలో పేర్లు రాకపోతే ఎవరూ కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. వారి కోసమే మళ్లీ ఈ గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నాలుగు రోజులు పాటు విడతల వారీగా ఆయా గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకునే వారిలో నిజమైన అర్హులు ఉంటే వారికి వెంటనే పథకాలను అందించడం జరుగుతుందన్నారు. రెచ్చగొట్టే మాటలను ఈ ప్రభుత్వం పట్టించుకోదని చిత్తశుద్ధితో పనిచేయడమే ఈ ప్రభుత్వానికి తెలుసన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

## గణతంత్ర వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు



**న్యూఢిల్లీ,జనవరి22 వెలుతురు:**
గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో హాజరవ్వనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఇండోనేషియా పాల్గొననుంది. జనవరి 26న కర్తవ్యపథ్‌లో నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఇండోనేషియాకు చెందిన 160 మంది సభ్యుల కవాతు బృందం, 190 మంది సభ్యుల బ్యాండ్ బృందం భారత సైనికులతో కలిసి కవాతు నిర్వహించనుందని భారత రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పరేడ్‌లో సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, సహాయక పౌర బలగాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాలు పాల్గొంటాయి. స్వదేశీ వాయిద్యాలతో కళాకారులు దేశభక్తి గీతాలను ఆలపించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. 1950 నుంచి భారత్ మిత్ర దేశాల నేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం సంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్‌డే వేడుకలు నిర్వహించారు. 2007లో పుతిన్(రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్), 2015లో బరాక్ ఒబామా (అమెరికా), 2016లో ఫ్రాన్సోయిస్ హోలన్ (ఫ్రాన్స్)లు అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానించారు. కానీ, కొవిడ్ కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దైంది. 2018లో ఆసియాన్ దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ముఖ్య అతిథిగా హాజరవ్వగా.. 2024 గణతంత్ర వేడుకలకు భారత ప్రభుత్వం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మెక్రాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

## నేటితో బేటీ బచావో, బేటీ పడావోకు పదేళ్లు

మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. లింగ అడ్డంకులు, పక్షపాతాలను అధిగమించడంపై ఈ ఉద్యమం దృష్టి సారించిందని, ఆడపిల్లలకు విద్య, అవకాశాలు ఉండేలా చూసేందుకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆడ పిల్లల లింగ నిష్పత్తులను సమతుల్యం చేయడం కోసం ప్రజలతోపాటు వివిధ కమ్యూనిటీ సంస్థలు చేపట్టిన ప్రయత్నాలకు, అంకిత భావానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పిల్లల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న జిల్లాలు గణనీయమైన మెరుగుదలను సాధించాయని, అవగాహన ప్రచారాలు లింగ సమానత్వం, ప్రాముఖ్యతను తెలియజేయడంలో హితోదికంగా తోడ్పడ్డాయన్నారు. దేశంలోని మహిళల హక్కులను కాపాడేందుకు, వారి విద్యకు భరోసా కల్పించేందుకు ఈ ఉద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'ఈ ఉద్యమాన్ని కింది స్థాయి నుంచి ఉధృతం చేసిన భాగస్వాములందరినీ అభినందిస్తున్నానన్నారు. మన కుమార్తెల హక్కులను పరిరక్షించడాన్ని కొనసాగిద్దాం, వారి విద్యను నిర్ధారిద్దాం. కలిసికట్టుగా వారి కోసం ఎటువంటి వివక్ష లేకుండా అభివృద్ధి చెందగల సమాజాన్ని సృష్టిద్దాం. రాబోయే రోజుల్లో మన దేశ కుమార్తెలకు గొప్ప పురోగతిని, అవకాశాలను వస్తాయ్' అని మోదీ అన్నారు.



## పద్మారావు గౌడ్ ను కలిసి ఆరోగ్య సమాచారం తెలుసుకున్న కేటీఆర్, ఈటల తదతరులు





( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 22:**
ఉత్తరాఖండ్ పర్యటనకు వెళ్లి గుండెపోటుకు గురై అక్కడే స్టంట్ వేయించుకొని హైదరాబాద్ తిరిగి వచ్చిన మాజీమంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ను ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు, బుధ వారం నాడు పద్మారావు గౌడ్ ను ఆయన స్వగృహంలో కలిసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్,పువ్వాడ అజయ్ కుమార్ లు ఎంఎల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్,మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తదితరులు పద్మారావు గౌడ్ ను కలిసి ఆరోగ్యం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు, అలాగే ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని కొంత కాలం విశ్రాంతి తీసుకోవాలని వారు ఆయనకు సూచించారు ,

## గాంధీ భవన్ లో కొట్టుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు





( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 22:**
గాంధీ భవన్‌లో కొట్టుకున్న యూత్ కాంగ్రెస్ నేతలు దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి, కాగా గాంధీ భవన్ లో యూత్ కాంగ్రెస్ జాతీయ నేతలు రావడం తో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నేతలు గాంధీ భవన్ లో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో బీఆర్ఎస్ పార్టీ నుండి వచ్చిన వారికి కాంగ్రెస్ పార్టీ లో పోస్టులు ఇచ్చారంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన ముందు నుంచి యూత్ కాంగ్రెస్ లో పని చేస్తున్న నేతలు ఆందోళనలు చేయడం తో యూత్ కాంగ్రెస్ పార్టీ లో కొత్త పాత నాయకులు ఇరు పక్షాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది, గాంధీ భవన్‌లోనే కొట్టుకున్న యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు,కాగా గాంధీ భవన్ లో జరిగిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ సురభి ద్వివేది,సయ్యాద్ ఖలీద్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి మనోజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు,

## బాలానగర్ డివిజన్ ముదిరాజ్ సభ విజయవంతం

- **నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసిన సురేందర్ ముదిరాజ్...**



**కూకట్ పల్లి జనవరి 22 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , కాసాని వీరేశ్ ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్ బుధవారం బాలానగర్ డివిజన్ ముదిరాజ్ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు మేకల శారద, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు బి.మాలతి, నాంపల్లి అధ్యక్షులు ఆర్. సాయిలు, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి , కూకట్ పల్లి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఇంచార్జి అంబటి శ్రీనివాస్, ఏ. బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, చిల్కురు హరిచందు, పంజా రాంచందర్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ లక్ష్మయ్య , మహంకాళి శివశంకర్, కుక్కల రమేష్, కుక్కల రాజు పటేల్, ఎడ్ల మోహన్ రెడ్డి నూతన ముదిరాజ్ కమిటీ సభ్యులు, భారీ సంఖ్యలో ముదిరాజ్ కులస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ సైకిళ్లు, కుట్టు మిషన్ల పంపిణీ చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్...






**కరీంనగర్ వెలుతురు జనవరి 22:**
కరీంనగర్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇందుర్తి పాఠశాలలోని పేద విద్యార్థులకు సైకిళ్లను, పలువురు మహిళలకు కుట్టు మిషన్ లను బుధవారం రోజున కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముఖ్యంగా పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని ఉద్దేశంతో, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను గుర్తించి కరీంనగర్ క్లబ్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థినీలకు సైకిళ్లను, అలాగే పదిమంది నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని రోటరీ క్లబ్ అధ్యక్షులు గోరిట్యాల వెంకట కిషన్ ఈ సందర్భంగా తెలిపారు. ఇలాగే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పాక పవన కృష్ణ, మాజీ గవర్నర్ డీకే ఆనంద్ , రాజిరెడ్డి ,చిట్టి రామారావు మాజీ కార్పొరేటర్, జి ఆనంద్ కుమార్, పి .తిరుపతి ,ఆలిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఇందుర్తి పాఠశాల విద్యార్థుల కోసం అడిగిన వెంటనే సైకిళ్లను అందించిన రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులకు పాఠశాల ఉపాధ్యాయులు బి. ఓదెల్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు.

## మిణుగురు దిన పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ






**హైదరాబాద్ వెలుతురు జనవరి 22:**
మిణుగురు తెలుగు దిన పత్రిక 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేసిన (టీజీవో ) తెలంగాణ ట్రాన్స్పోర్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లెంల రవీందర్ గౌడ్, టీజీవో నగర శాఖ అధ్యక్షులు ఎంబి కృష్ణ యాదవ్, సీపీఎం నేత దశరథం, సాయి దత్త ఫర్నిచర్ అధినేత కుమార్, మిణుగురు ఎడిటర్ కలుకూరి రాజు, వెలుతురు ఎడిటర్ బక్క యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం..

## ట్రంపరితనంతో... లాభమెంత..నష్టమెంత?

ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కొందరికి నచ్చకపోవచ్చు...కానీ అమెరికన్లకు మాత్రం నచ్చి తీరుతుంది. అమెరికా ఫస్ట్ అన్న ఆయన నినాదం బాగా ప్రాచుర్యం పొందింది. ఏ పాలకుడైనా తమ దేశ ప్రయోజనా లను మాత్రమే చూస్తారు. అందుకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటారు. ట్రంప్ కూడా ఇప్పుడు అదేవిధమైన విధానాలతో ముందుకు సాగుతున్నారు. కాకపోతే అమెరికాపై చాలామింది ఆధారపడి బతుకుతున్నందున వారికి ఇవి నచ్చకపోవచ్చు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పిల్లలను కని, వారిని అమెరికా పౌరులు చేస్తామంటే ఎవ్వరికైనా మండుతుంది. ట్రంప్‌కు అక్కడే మండింది. అందుకే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేశారు. ఉద్యోగాలు కూడా స్థానికులకే ఇవ్వాలన్నది ఆయన మొదటినుంచి పట్టుబడుతున్న వ్యవహారమే. హెచ్-1 వీసాల విషయంలోనూ ముఖ్యంగా భారతీయుల్లో ఆందోళన నెలకొంది. మాకు దక్కాల్సిన ఉద్యోగాలను ఎగరేసుకుని పోతున్నారని అమెరికన్లు ఎప్పటి నుంచే గగ్గోలు పెడుతున్నారు. ఇవన్నీ కూడా ట్రంపం ఎన్నికల ప్రచారంలో బాగా ప్రాచుర్యం పొందినవే. అమెరికాకు అనుగుణంగా ట్రంప నిర్ణయాలు తీసుకుంటున్నారు. వీటిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇవి మనకు అనుకూలంగా లేవు కనక మనం బధపడుతున్నారు. అమెరికా ఫస్ట్ అన్న ఆయన నినాదం మేరకు నిర్ణయాలు ఉంటాయని తెలియచేస్తున్నారు. అలా అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసీ చేయగానే ట్రంప్ తను గతంలో ప్రకటించిన మేరకు నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. అందులో ఒకటి- పారిస్ ఒప్పందం నుంచి మళ్లీ బయటకు రావడం. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడతానంటూ తొలిరోజు ప్రసంగంలో దేశ ప్రజలకు హామీ ఇచ్చిన ట్రంప్.. భూతాపానికి ముకుతాడు వేసేందుకు 190కి పైగా దేశాలు ఒక్కతాటిపైకి వచ్చి కుదుర్చుకున్న ఒడంబడికనుంచి వైదొలగడంమిగతా ప్రపంచ దేశాలకు నచ్చలేదు. అందుకే అమెరికాకు తొలిసారి అధ్యక్షుడయ్యాక ట్రంప్ ఈ ఒప్పందంనుంచి వైదొలగడంతో ప్రపంచ దేశాలన్నీ ఆందోళన వెలిబుచ్చాయి. దూకుడుతనానికీ, దుందుడుకు స్వభావానికి డొనాల్డ్ ట్రంప్ పెట్టింది పేరు. అలా ఉండటమే తనకు రెండోసారి అధ్యక్ష పదవిని కట్టబెట్టిందని ఆయన ప్రగాఢంగా విశ్వసిస్తారు. కీలకమైన పారిస్ ఒప్పందం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకున్న బైడెన్, తాను అధికారంలోకి వచ్చాక 2021లో మళ్లీ ఒప్పందంలో అమెరికాను చేర్చారు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లు అని నిర్ద్వంద్వంగా, నిస్సంకోచంగా వాదించే ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు కాగానే ఈ ఒప్పందాన్ని కాలరాచేందుకు ఉద్యుక్తుడయ్యారు. అంతేకాదు, కొవిడ్ వ్యాప్తి సమయంలో బాధ్యతారహితంగా ప్రవర్తించిందనే ఆగ్రహంతో ప్రపంచ ఆరోగ్య సంస్థనుంచి కూడా వైదొలగుతూ ఆయన నిర్ణయం తీసుకోవడం జరిగింది. దీనివల్ల అమెరికాకు వచ్చే లాభం ఎంతన్నది ఆయన చేస్తున్న వాదనగా ఉంది.కృత్రిమ మేధ విస్తరిస్తే మనవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, బైడెన్ ప్రభుత్వం దీని విస్తరణపై విధించిన ఆంక్షలను తాజాగా ట్రంప్ తొలగించారు. కీలకమైన అంశాలపై లోతైన అధ్యయనం, విస్తృతమైన చర్చలు.. ఏవీ లేకుండా వచ్చీరాగానే కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేయడం ఆయన తొందరపాటుకు నిదర్శనమనే చెప్పాలి. పదవిలోకి రాకముందే హమాస్-ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు పలికారనే ఘనతను ట్రంప్ దక్కించుకున్నారు. ఆయన హెచ్చరికలవల్లే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ దిగి వచ్చారని విశ్వసించేవారు ఎంతోమంది ఉన్నారు. రష్యా -ఉక్రెయిన్ యుద్ధానికి కూడా ట్రంప్ చరమాంకం పలుకుతారని ఆయన అనుయాయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు యుద్ధ విరమణకు కృషి చేస్తూ, మరోవైపు గ్రీన్‌లాండ్‌నూ, పనామా కాలువనూ స్వాధీనం చేసుకుంటామంటూ తొలిరోజే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ట్రంప్ మనస్తత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అనేది ఇక్కడ ప్రశ్న. తొలిసారి మాదిరిగానే ఈసారి కూడా ట్రంప్ ప్రసంగం దూకుడుగా, తన మద్దతుదారులు, దేశప్రజలలో ఉత్సాహం నింపేదిగా సాగింది. 'అమెరికాకు స్వర్ణయుగం మొదలైంది. మునుపెన్నడూ లేనంత దృఢమైన, పటిష్ఠమైన, అసాధారణమైన దేశంగా అమెరికాను తీర్చిదిద్దుతా'నంటూ ఆయన అభిమానుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మొదటిసారికంటే ఈ తడవ మరింత శక్తిమంతమైన నేతగా ట్రంప్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రతినిధుల సభలోనూ, సెనేట్‌లోనూ మెజారిటీ బలం రిపబ్లికన్ పార్టీదే కావడం ఇందుకు కారణం. భారత్,అమెరికా ద్వైపాక్షిక సంబంధాల విషయానికొస్తే మోడీ- జో బైడెన్ హయాంలో ఇరుదేశాల మధ్య బంధం మున్నెన్నడూ లేనంతగా బలోపేతమైందనేది జగద్విదితం. శత్రువుకు శత్రువు మనకు మిత్రుడన్న నానుడిని నిజం చేస్తూ ఇరు దేశాలకూ పక్కలో బల్లెంలా మారిన చైనా.. ఈ రెండు దేశాల మధ్య స్నేహసంబంధాలు బలపడటానికి కారణమైంది. అమెరికా ఉత్పత్తులపై భారత్ భారీ సుంకాలు విధిస్తోందని అంటూ ఇప్పటికే పలు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్, భారత్ ఉత్పత్తులపైనా అదే విధంగా సుంకాలు విధించే అవకాశం ఉండవచ్చు. అంతమాత్రానికే, ఇరు దేశాల మధ్య సంబంధాలు బలహీన పడతాయని భావించరాదు. ట్రంప్ విదేశాంగ విధానంలో కొంత గందరగోళం ఉంటుందన్నది విస్పష్టం. అమెరికాకు ప్రత్యామ్నాయ ఆర్థిక శక్తిగా ఎదిగుతున్న చైనా మెడలు వంచడం అనుకున్నంత సులభమేమీ కాదు. ఏదేమైనా ఎవరి విధానాలు వారివి. వారికి అనుగుణంగానే ఇతర దేశాలు నడుచుకోవాలి. అవి మనకు ఉపయోగమా కాదా అన్నది ముఖ్యం కాదు. అక్కడి చట్టాలు, పరిస్థితులకు అనుగుణంగా మనం నడుచుకోగలమా లేదా అన్నదే ముఖ్యం.

# హెచ్1బీ వీసాల విస్తరణపై భిన్నాభిప్రాయాలు

- **చట్టబద్ధమైన వలసలకు మస్క్, వివేక్ రామస్వామి మద్దతు**
- **వ్యతిరేకిస్తున్న రిపబ్లికన్ పార్టీ నేత నిక్కీ హేలీ**

**వాషింగ్టన్,జనవరి22( వెలుతురు):**

హెచ్1బీ వీసాల విస్తరణపై డొనాల్డ్ ట్రంప్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇస్తుంటే ఇతర నేతలు మాత్రం అమెరికా ఫస్ట్ విధానానికి కట్టుబడి ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా దీనిపై అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. తనకు రెండు వైపుల వాదనలూ నచ్చాయన్నారు. అయితే, సమర్థవంతమైన ప్రజలు అమెరికాలోకి రావాలని తాను కోరుకుంటున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు వైట్‌హౌస్‌లో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 'ఈ అంశంపై నాకు రెండు వైపుల వాదనలూ నచ్చాయి. సమర్థవంతులైన వ్యక్తులు మన దేశంలోకి రావడాన్ని నేనూ ఇష్టపడతాను. కేవలం ఇంజనీర్ల గురించి మాత్రమే నేను మాట్లడటం లేదు. అన్ని స్థాయిల వ్యక్తులను దృష్టిలో ఉంచుకొని ఈ మాట చెబుతున్నా. దేశ వ్యాపారాలను విస్తరింపచేసేందుకు మాకు సమర్థవంతమైన, నైపుణ్యం కలిగిన వ్యక్తులు కావాలి. అది హెచ్1బీ వీసాతో సాధ్యమవుతుంది. అందుకే నేను రెండు వాదనలనూ సమర్థిస్తున్నా' అని ట్రంప్ పేర్కొన్నారు. అర్హత కలిగిన సాంకేతిక నిపుణులు అమెరికాకు వచ్చేందుకు హెచ్1బీ వీసా ఉపయోగ పడుతోందని ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై రిపబ్లికన్ పార్టీకి చెందిన నిక్కీ హేలీ భిన్నమైన వాదనను వినిపించారు. 'నేను సౌత్





కరోలినా గవర్నర్‌గా పనిచేసిన సమయంలో నిరుద్యోగిత రేటు 11 శాతం నుంచి 4 శాతానికి పడిపోయింది. విదేశీ ఉద్యోగులను కాకుండా పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించాం కాబట్టే అది సాధ్యమైంది. కొత్త ఉద్యోగాల కోసం ప్రజలకు శిక్షణ ఇవ్వడం వల్ల వారు ఇప్పుడు విమానాలు, ఆటోమొబైల్స్ తయారీలో రాణిస్తున్నారు. సాంకేతిక రంగాన్ని బలోపేతం చేయాలని భావిస్తే ముందు విద్యారంగంపై దృష్టిసారించాలి. అంతేకానీ అమెరికన్లను తక్కువ అంచనా వేయొద్దు' అని స్పష్టంగా తన అభిప్రాయాన్ని వినిపించారు.ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలిగ్గా నియమించుకొనేందుకు అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ మాజీ అధ్యక్షుడు జో బైడెన్ కార్యవర్గం పలు నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతోపాటు సులువుగా ఎఫ్-1 విద్యార్థి వీసాలను హెచ్-1బీ వీసాలుగా మార్చుకొనే అవకాశం కల్పించింది. ఇది లక్షల మంది భారతీయ వృత్తి నిపుణులకు ప్రయోజనం కల్పించనుంది. ఈ వీసా నాన్ ఇమిగ్రెంట్ కేటగిరీలోకి వస్తుంది. టెక్నాలజీ కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను దీని సాయంతో నియమించుకుంటున్నాయి. ముఖ్యంగా భారత్, చైనా దేశాలు ఈ వీసా నుంచి చాలా ప్రయోజనం పొందుతున్నాయి.

# సిల్క్‌రోడ్ డార్క్‌వెబ్ వ్యవస్థాపకుడి నేరాలు

- **రాస్ విలియం ఉల్‌బ్రిచ్ట్ క్షమాభిక్ష**
- **ట్రంప్ మరో దుందుడుకు నిర్ణయం**

**వాషింగ్టన్,జనవరి22( వెలుతురు):**

అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్ వరుసగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేస్తున్నారు. అలాగే పలు కేసుల్లో దోషులను విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సిల్క్‌రోడ్ డార్క్‌వెబ్ వ్యవస్థాపకుడు రాస్ విలియం ఉల్‌బ్రిచ్ట్‌ను క్షమించారు. ఇంటర్నెట్ వేదికగా విస్తృతస్థాయిలో నేర సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారన్న అభియోగాలపై అమెరికా న్యాయస్థానం రాస్ విలియంకు 2015లో జీవితఖైదు విధించింది. సిల్క్‌రోడ్ ఇ-కామర్స్ వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసి.. మనీలాండరింగ్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, కంప్యూటర్ హ్యాకింగ్‌కు పాల్పడ్డారని విలియంపై అభియోగాలు నమోదుకాగా.. 2013లో ఎఫ్‌బీఐ ఆ వెబ్‌సైట్‌ను మూసివేసింది. 'అతడొక డ్రగ్ డీలర్. ప్రజల వ్యసనాల నుంచి లబ్ధిపొందాడు. ఆరుగురు ప్రాణాలు



పోవడానికి కారకుడయ్యాడు' అని జీవితఖైదు శిక్ష వేసిన సందర్భంగా మాన్‌హటన్ అటార్నీ పేర్కొన్నారు. కాగా.. తాను అధికారంలోకి వస్తే రాస్ విలియంకు క్షమాభిక్ష పెడతానని గత మే నెలలో ట్రంప్ హామీ ఇచ్చారు. అతడు ఇప్పటికే 11 సంవత్సరాల శిక్ష అనుభవించాడని వ్యాఖ్యానించారు. అతడికి విధించిన శిక్ష హాస్యాస్పదమంటూ తాజాగా అభివర్ణించారు. చర్చిలు, పాఠశాలల్లో అక్రమ వలసదారులు ఉంటే అరెస్టు చేయకూడదనే గత నిబంధనను తాజాగా ట్రంప్ (యుసబీపూ) ప్రభుత్వం తొలగించింది. దాంతో ఇకపై పాఠశాలలు, చర్చిలలోనూ అక్రమ వలసదారుల అరెస్టుకు వీలు కలుగుతుంది. ఈ తొలగింపు వల్ల ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు అరెస్టులను వేగవంతం చేసేందుకు అనుమతి లభించినట్లయింది. హంతకులు, రేపిస్టులను పట్టుకోవడానికి తాజా ఉత్తర్వులు దోహదపడతాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ఈ నిర్ణయాన్ని సమర్థించింది.

# జన్మతః పౌరసత్వం రద్దు వ్యవహారం

- **ట్రంప్ నిర్ణయంపై పలు రాష్ట్రాలు వ్యతిరేకం**
- **ఉమ్మడిగా కోర్టుల్లో సవాల్ చేసిన 22 రష్ట్రాలు**

**వాషింగ్టన్,జనవరి22( వెలుతురు):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టిన మొదటిరోజే పలు కీలక ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఇందులో పౌరసత్వంపై చేసిన ఉత్తర్వులను పలు రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ట్రంప్ చెప్పినట్టుగానే వలసలను కట్టడి చేసే దిశగా కఠినంగా వ్యవహరిస్తున్నారు. అందులో జన్మతః వచ్చే పౌరసత్వం రద్దు కూడా ఒకటి. దీనిపై డెమోక్రటిక్ పార్టీ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వారి పాలనలో ఉన్న 22 రాష్ట్రాలు ఈ నిర్ణయాన్ని న్యాయ స్థానాల్లో సవాల్ చేశాయి. 22 రాష్ట్రాలు కలిసి రెండు వేర్వేరు వ్యాజ్యాలు దాఖలు చేశాయి. అధ్యక్షుడి నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కాలిఫోర్నియా అటార్నీ జనరల్ వెల్లడించారు. ఈ ఉత్తర్వులు అమల్లోకి రాకుండా వెంటనే నిలిపివేయాలని తమ వ్యాజ్యంలో కోర్టును




కోరారు. సరైన పత్రాల్లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారు దాదాపు 1.40 కోట్లమంది ఉంటారని అంచనా. వీరిలో భారతీయుల సంఖ్య సుమారు 7.25 లక్షలు. మెక్సికో, సాల్వెడార్ ప్రజల తర్వాత ఎక్కువగా ఉన్నది మన వారే. ఎన్నికల ప్రచారం నుంచి ఇలాంటివారి విషయంలో పదేపదే తన వైఖరిని ట్రంప్ వెల్లడించారు. బాధ్యతలు చేపట్టాక స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా పౌరసత్వాన్ని అందించే చట్టాన్ని ట్రంప్ రద్దు చేశారు. ఆ దేశ రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం పిల్లలకు ఈ హక్కు సంక్రమిస్తుంది. దీనిపై ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. ఆ దేశ జనాభాలో సుమారు 50 లక్షల (1.47 శాతం) మంది భారతీయులున్నారు. వీరిలో మూడోవంతు మంది అమెరికాలో పుట్టినవారే. మిగిలిన వారంతా వలసదారులు. న్యాయపరంగా ఎలాంటి అవరోధం లేకపోతే.. సంతకం చేసిన 30 రోజుల్లో ఈ ఉత్తర్వు అమల్లోకి వస్తుంది.

# డైవర్సిటీ, ఇన్‌క్లూజన్ ప్రోగ్రామ్‌ల నిర్వీర్యం

- **సిబ్బందికి లే ఆఫ్ ఇస్తూ తాజా ఉత్తర్వులు**

**వాషింగ్టన్,జనవరి22( వెలుతురు):**

అగ్రరాజ్యానికి రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పాలనలో దూకుడు పెంచారు. ఇప్పటికే గత అధ్యక్షుడు జో బైడెన్ ఇచ్చిన 78 ఆదేశాలను రద్దు చేస్తూ డజన్ల కొద్దీ కార్యనిర్వాహక ఆదేశాలను జారీ చేశారు. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫెడరల్ డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బంది అందరికీ లేఆఫ్ లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వారందరినీ సెలవులో ఉంచాలని ఆదేశిస్తూ ట్రంప్ కార్యవర్గం ఓ మెమో జారీ చేసింది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డైవర్సిటీ, ఇన్‌క్లూజన్ ప్రోగ్రామ్‌లను నిర్వీర్యం చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఈ నేపథ్యంలోనే సిబ్బంది నిర్వహణ కార్యాలయం మెమో విడుదల చేసింది. దాని ప్రకారం.. డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ (డీఈఐ) సిబ్బంది అందరినీ అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా వేతనంతో కూడిన సెలవుపై పంపించాలని సంబంధిత ఏజెన్సీలకు ఆదేశాలు అందాయి. ఈ విభాగాలకు చెందిన అన్ని వెబ్ పేజీలను కూడా ఈ గడువులోగా తొలగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దీంతో పాటు డీఈఐ సంబంధిత శిక్షణ కార్యక్రమాలను తక్షణమే ముగించాలని ఏజెన్సీలకు సూచించారు. ఈ విభాగాలు చేసుకున్న ఒప్పందాలను కూడా రద్దు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కొన్ని వెబ్ సైట్లను తొలగించారు. వచ్చే శుక్రవారం నాటికి వీరికి లేఆఫ్‌లు ఇచ్చి ఫెడరల్ సిబ్బంది సంఖ్యలో కోత విధించాలని ట్రంప్ సర్కారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాల కోతపై నూతన అధ్యక్షుడి యంత్రాంగం నుంచి ఇంకా ప్రకటన వెలువడలేదు. అయితే, తాజా నిర్ణయం ఎంతమందిపై ప్రభావం చూపనుందనేదానిపై ఇంకా స్పష్టత లేదు.




# ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య ఘర్షణ


- **ఒకరిపై కత్తితో దాడి.. అక్కడికక్కడే మృతి**

**హనుమకొండ,జనవరి22( వెలుతురు):**



ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య జరిగిన గొడవ చివరకు ఒక ఆటో డ్రైవర్ ప్రాణం తీసింది. పట్టపగలే జరిగిన ఈ సంఘటన హనుమకొండలో చోటుచేసుకుంది. ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య తలెత్తిన వివాదం కత్తి దాడికి దారితీసింది. ఈ క్రమంలో కత్తిపోట్లకు గురై తీవ్ర రక్తస్రావంతో ఓ ఆటో డ్రైవర్ నడిరోడ్డుపైనే దారుణహత్యకు గురయ్యాడు. హనుమకొండ పోలీస్ డివిజన్ సుబేదారి పీఎస్ పరిధిలో ఉన్న డీమార్ట్ ఎదురుగా ఘటన జరిగింది. ఆటో స్టాండ్ పక్కన ఇద్దరు ఆటో డ్రైవర్లు గొడవ పడుతున్న వీడియోలు వైరల్ అయ్యాయి. మడికొండకు చెందిన రాజ్ కుమార్‌పై మరో ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేస్తుండగా.. విడిపించేందుకు ఓ వ్యక్తి తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పట్టపగలే నడిరోడ్డుపై హత్యకు గురైన వ్యక్తిని ఆటోడ్రైవర్ రాజ్‌కుమార్‌గా పోలీసులు గుర్తించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న సుబేదారి పీఎస్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

## ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల వసూళ్లను నివారించాలని కోరుతూ డీఈఓ కు వినతి పత్రం అందజేసిన నాయకులు...



**కూకట్ పల్లి జనవరి 22 వెలుతురు:**
కూకట్ పల్లి , కుత్బుల్లాపూర్ నియోజక వర్గాల పరిధిలో గల ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వాటిని నియంత్రించాలని కోరుతూ వివేకానంద నగర్ డివిజన్ కు చెందిన యువ నాయకులు మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేకాకుండా స్కూల్ యూనిఫామ్, పుస్తకాల పేరుతో అదనంగా తల్లిదండ్రుల నుండి ముక్కు పిండి డబ్బులు వసూలు చేయడం విస్మయాన్ని కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో సంవత్సరానికి ఇచ్చే ఫీజులు విడతలవారీగా చెల్లించాల్సింది పోయి ఒక్కసారిగా సంవత్సరం కాలంకి సంబంధించి డబ్బులు వసూలు చేస్తున్నారని డిఈవో దృష్టికి తెచ్చారు. ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు కల్పించకపోవడం, విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలాలు లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. ప్రధానంగా మాధవరం కాలనీలోని న్యూఎరా, నారాయణ పాఠశాలకు అనుమతులు లేనప్పటికీ వారు నిర్వహిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ వార్డు కమిటీ సభ్యులు రాసూరి చంద్రమోహన సాగర్, కెపి శివ, జి రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం కృషి చేస్తాం

- మేడిపల్లి ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క



**మేడిపల్లి వెలుతురు:**
తెలంగాణ రాష్ట్రములోని జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దేవి కన్వెన్షన్ హాల్ లో జరిగిన మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అమే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రములో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇండ్లకు ప్రజాపాలన వచ్చాకా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. సమాజంలో నాలుగో స్థంభమైన మీడియాకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.జర్నలిస్టుల ఆరోగ్య భద్రత గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి ప్రెస్ అధ్యక్షుడు కల్యారి ఎల్లయ్య అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శి గడ్డమిది బాల్ రాజు గౌడ్, డీ.వెంకట్ రాం రెడ్డి బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, అమర్ సింగ్,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్,ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చిర్ర శ్రీధర్ రెడ్డి,కార్పొరేటర్లు, క్లబ్ కార్యవర్గ సభ్యులు,వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం..

-బండి రమేష్



**కూకట్ పల్లి జనవరి 22 వెలుతురు:**
క్రీడలతో మానసికోల్లాసం, శారీరక ధారుఢ్యం పెరుగుతుందని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. కల్చరల్ వెల్ఫేర్, స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ లో ఈనెల 24వ తేదీన తెలంగాణ సీఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించిన నేపధ్యంలో బుధవారం ఆయన టోర్నమెంట్ ఏర్పాటు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బండి రమేష్ వాలీబాల్ ఆడుతూ నాయకులు కార్యకర్తలు, క్రీడాకారులతో కాసేపు సరదాగా గడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకుగానూ శేరి సతీష్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాదు ప్రతాపరెడ్డి, విట్టల్ రెడ్డి, రఘు, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అధ్యక్షురాలు సంధ్యారాణి, పొన్నం రజిత, ఏఎంసి వైస్ చైర్మన్, రేష్మ, మేకల మైఖేల్, మస్తాన్ రెడ్డి, సునీల్ యాదవ్, కొండల్ రెడ్డి, శివ చౌదరి, ముస్తఫా, నయన్ బాయ్, అల్లావుద్దీన్, అశోక్, శ్రీధర్ చారి, రాజు ముదిరాజ్, బాబురావు, రామకృష్ణారెడ్డి, గిరి నాయుడు, నాయకులు, నాయకురాలు, క్రీడాకారులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీఓ డైరీ ఆవిష్కరణ

**హైదరాబాద్ వెలుతురు జనవరి 22:**
తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నగర శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం రోజుసాయంత్రం 5.30 గంటలకు టీజీవోస్ నగర శాఖ, హైదరాబాద్ వారి డైరీ ఆవిష్కరణ సభ గండూరి వెంకటేశ్వర్లు అధ్యక్షులు నగర శాఖ హైదరాబాద్ అధ్యక్షతన అర్థగణాంక శాఖ కార్యాలయము, హైదరాబాద్జరిగినది.
ఇట్టి సభ యందు ఏలూరు శ్రీనివాసరావు అధ్యక్షులు టీజీవోస్ సెంట్రల్ అసోసియేషన్, ఏ. సత్యనారాయణ జనరల్ సెక్రటరీ, పి.రూఫస్ దత్తం, సంచాలకులు అర్థగణాంక శాఖ, హైదరాబాద్, పి. మనోహర్





సంచాలకులు & ADG, TGRAC, షేక్ మీర సీఈఓ TGDPS గార్లు ముఖ్య అతిథులుగా పాల్గొని డైరీ ని ఆవిష్కరించారు. ఈ సభ యందు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరి శ్రీనివాసరావు, మాట్లాడుతూ ఉద్యోగులకు, పెన్షనర్లకు రావాల్సి ఉన్న పెండింగ్ మెడికల్ బిల్లులు మరియు ప్రభుత్వ సర్వీసు నుండి విరమణ పొందిన ఉద్యోగుల యొక్క నగదు ప్రయోజనాలు తక్షణమే చెల్లించవలసిందిగా ప్రభుత్వమును కోరినారు.
గండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెండింగ్ లో వున్న డిఏ విడుదల చేయవలసిందిగా, కంట్రిబ్యూటరి పెన్షన్ విధానమును రద్దు పరిచి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయవలసిందిగా మరియు నగదు రహిత ఆరోగ్య కార్డులను వెంటనే ఇవ్వవలసిందిగా ప్రభుత్వమును డిమాండ్ చేసినారు. ఈ సందర్భంగా పి.రూఫస్ దత్తం సంచాలకులు మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు అందరూ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు జారీ వంటి ఇతరాత్ర ప్రాధాన్యత కార్యక్రమముల యందు పాల్గొని ప్రజలకు సేవలు అందించవలసిందిగా కోరినారు. ఇట్టి సభ యందు ఏస్ . నిరంజన్ రెడ్డి, సెక్రెటరీ టీజీవోస్ నగర శాఖ, బి. శ్యాం అసోసియేట్ అధ్యక్షులు, శ్రీ జగన్మోహన్రావు ఉపాధ్యక్షులు టీజీవోస్ సెంట్రల్ అసోసియేషన్, కృష్ణ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, షౌకత్ హుస్సేన్, డి. శివకుమార్, సురభి వెంకటేశ్వర్లు, బి వేణుమాధవ్, ఆర్ నరసింహ చారి, లావణ్య, స్వర్ణ లత, సుజాత, సబిత, ఖాదర్,పరమేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, పరమేశ్వర్ రెడ్డి, శ్రీరాంరెడ్డి, రామారావు, యశోద, సముజ్వల. శ్రీనివాస్, యాదగిరి గౌడ్, ఉమారాణి, ప్రియదర్శిని, యాదగిరి, అపర్ణ, వెంకటేశ్వర్లు, నందిని, వసుంధర, ప్రసన్న, సయీద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు, పాలకుల మధ్య సమన్వయ లోపం.. ప్రజలు అయోమయం..

- అప్లికేషన్లతో వార్డ్ ఆఫీసుల చుట్టూ ప్రజలు చక్కర్లు..
- రేషన్ కార్డుల దరఖాస్తు స్వీకరణలో స్పష్టత లేదు... కార్పొరేటర్ రోజా దేవి రంగారావు



**కూకట్ పల్లి జనవరి 22 వెలుతురు:**
శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లో రేషన్ కార్డులు దరఖాస్తుల స్వీకరణలో స్పష్టత లేని ప్రకటనలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తూ అధికారులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరణ అని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బుధవారం ఆమె వివేకానంద నగర్ డివిజన్ లోని వార్డ్ ఆఫీస్ కి వెళ్లి పరిశీలించగా అక్కడ ఏ అధికారి లేకపోవడంతో వారికి ఫోన్ చేసి మాట్లాడగా వారికి దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఎలాంటి సూచనలు ఇవ్వలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిఎసి చైర్మన్, శేర్లింగంపల్లి నియోజక వర్గం శాసనసభ్యులు అరికెపూడి గాంధీ తాజాగా వాణిజ్య మాధ్యమాల్లో కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు ఈనెల 21 నుండి ఫిబ్రవరి 24వ తేదీ వరకు డివిజన్లోని వార్డ్ ఆఫీసులలో స్వీకరించబడతాయని ప్రకటించిన నేపథ్యంలో పెద్ద ఎత్తున ప్రజలందరూ తమ తమ దరఖాస్తులు ఇవ్వడానికి వార్డ్ ఆఫీస్ కి చేరుకోగా అక్కడ అధికారులు మాత్రం తమకు దరఖాస్తులు స్వీకరించమని ఎలాంటి సూచనలు అందలేదని ప్రజలను తిప్పి పంపించడంతో ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పాలకుల, అధికారులకు సమన్వయ లోపమా లేకపోతే ప్రజలను మభ్య పెట్టడానికి ప్రకటనలు చేస్తున్నారా పాలకుల ప్రకటనలకు క్షేత్రస్థాయి ఆచరణకు ఎటువంటి సంబంధం లేకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్న ప్రజా పాలన ఇదేనా అని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులు కూడా కేవలం 40 శాతం మాత్రమే ఎంట్రీలు అవడంతో ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతూ అయోమయంలో ఉండగా ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు విషయంలో స్పష్టత లేని ప్రకటనలు చేయడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారు అని అన్నారు.

## హయత్ నగర్ లో రోడ్డు భద్రత మహోత్సవాలు పై విద్యార్థుల ర్యాలీ



**వెలుతురు, హయత్ నగర్, జనవరి 22:**
జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు 2025 పుష్కరించుకొని హయత్ నగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధ వారం ర్యాలీ నిర్వహించారు, ఈ ర్యాలీ కార్యక్రమంలో హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాస్ , ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిర ,పాఠశాల పీడి నిర్మల మరియు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు మహా ర్యాలీ నిర్వహించారు,ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం- రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం అని వివిధ రోడ్డు భద్రత నినాదాలు చేస్తూ పాఠశాల విద్యార్థులు నినాదాలు చేస్తూ పాఠశాల ప్రాంగణం నుండి ఎంపీడీవో ఆఫీసు మీదుగా మహా ర్యాలీ నిర్వహించారు ,ఈ ర్యాలీ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి , హయత్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ,మోటార్ ట్రాన్స్ పోర్ట్ ఇన్స్పెక్టర్ అనుష ,ఎస్సైలు , సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు,



## రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 22:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాల అమలు ప్రక్రియలో భాగంగా మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి మండలంలో కోల్తూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కంగారు పడవద్దని, ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అంతే కాకుండా గ్రామ, వార్డు సభలలో నోటీసు బోర్డులలో ఉంచిన జాబితాలను ఒకసారి చూసుకొని ఏవైన అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు, గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి తహసీల్దార్ నర్సింహారెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కాలువ నిర్మాణానికి లెవెల్స్ ను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**వెలుతురు, హయత్ నగర్, జనవరి 22:**
బిఎన్ రెడ్డి డివిజన్ లోని కప్పల చెరువు నుండి హయత్ నగర్ డివిజన్ లో ఉన్న ఆంధ్ర కేసరి నగర్ మీదుగా శారద నగర్ వరకు నిర్మించనున్న వరద నీటి కాలువ నిర్మాణమును హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులతో కలిసి బుధ వారం లెవెల్స్ పరిశీలించారు, ఈకార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్,డి ఇ దామోదర్ ,వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం -పరిశుభ్రత కార్యక్రమం ను నిర్వహించిన సీపీఐ నాయకులు



**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, జనవరి 22:**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేస్ -3 లో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి జాగా కావాలనే లక్ష్యం తో సీపీఐ పార్టీ చేస్తున్న భూ పోరాట సమరంకు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని 3 వ ఏడాదికి అడుగు పెడుతున్న సందర్భంగా అక్కడి పరిసరాల పరిశుభ్రత నిర్వహిస్తున్న సిపిఐ నాయకులు నిర్వహించారు, ఈ భూ పోరాటం నిర్వాహకులు ఆందోజు రవీంద్ర చారీ, ముత్యాల యాదిరెడ్డి, సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్ మరియు కాటి అరుణ, వట్టి నవనీత, తగిలి మధు ,సైదులు ముదిరాజ్, ఆవుల యాదగిరి, చెంచేటి సుజాత, వీరేష్, శ్రీకాంత్ తదితర నాయకుల తో పాటు కార్యక్తరలు పాల్గొన్నారు,

# సరూర్ నగర్ కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు కీలక దర్యాప్తు

- 55 లక్షల రూపాయల చేతులు మారినట్లు గుర్తింపు
- కిడ్నీ రాకెట్ కేసులో కీలక మధ్యవర్తి ప్రదీప్, కాగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసిన డాక్టర్ పవన్ గా గుర్తించిన పోలీసులు
- కిడ్నీ ని పేషంట్- డోనర్ లుగా రాజశేఖర్, ప్రభగా గుర్తించిన పోలీసులు






(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 22:** హైదరాబాద్ సరూర్ నగర్ డాక్టర్స్ కాలనీలోని అలకనంద ఆసుపత్రిలో జరిగిన కిడ్నీ రాకెట్ వ్యవహారం సంచలనంగా మారిపోయింది. అలకనంద హాస్పిటల్ లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసిన డాక్టర్ పవన్ గా గుర్తించారు , ఆయన ప్రదీప్ అనే వ్యక్తి మధ్యవర్తి ద్వారా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ కోసం కీలక పాత్ర పోషించాడు, ఈయన కిడ్నీ ఇచ్చిన డోనర్ రాజశేఖర్,పేషంట్ ప్రభగా పోలీసులు గుర్తించారు, అయితే ఈ కిడ్నీ మార్పిడి ఆపరేషన్ కు సంబంధించి 55 లక్షల రూపాయల చేతులు మారినట్లు తెలుస్తోంది, అయితే కిడ్నీ మార్పిడి ఆపరేషన్ వ్యవహారం ఏప్పటి నుండి జరుగుతున్నాయి అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు, ఒకసారిగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స వ్యవహారం నగరంలో వెలుగులోకి రావడంతో పోలీసులు, వైద్య బృందం రంగంలోకి దిగింది, దీనిపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షిస్తామని పోలీసులు చెబుతున్నారు, అయితే అలకనంద హాస్పిటల్ లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ లో జరిగిన వ్యవహారం పై విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏ ఐ వై ఎఫ్ నాయకులు హాస్పిటల్ ముందు ఆందోళన నిర్వహించారు,వైద్య అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రిల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పైగా లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయని ఆరోపిస్తున్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే అమాయక ప్రజలు మధ్య దళారీలతో కిడ్నీలు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు, ప్రభుత్వం స్పందించి వెంటనే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పైగా సరూర్ నగర్ అలకనంద హాస్పిటల్ లో జరిగిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ సంఘటన పై విచారణ వేగం పెంచాలని డిమాండ్ చేశారు, రాష్ట్రంలో కిడ్నీ రాకెట్ వ్యహారం పై లోతైన దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు, అలాగే కిడ్నీ మార్పిడి ఆపరేషన్ ను అక్రమ మార్గంలో నిర్వహించి అమాయకపు ప్రజల కిడ్నీల వ్యవహారం చేస్తూ కోట్ల రూపాయలను అక్రమ మార్గం లో సంపాదన చేసే డాక్టర్ల కు కఠిన శిక్షలు వేయాలని ఏ ఐ వై ఎఫ్ నాయకులు కోరుతున్నారు, కాగా ఇప్పటికే సరూర్ నగర్ అలకనంద హాస్పిటల్ లో జరిగిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ సంఘటన పై స్పందించిన వైద్య అధికారులు, పోలీస్ అధికారులు స్పందించి దర్యాప్తు పూర్తి చేసి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు,

# 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన సీఐ రాఘవేందర్ రెడ్డి







స్కూల్లో విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన శిగ వీరస్వామి గౌడ్ ను వారి కుమారుడైన శిగ భరాత్వాజ్ గౌడు గురించి

**ఆదిభట్ల వెలుతురు జనవరి 22:** బుధవారం రోజున ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ జిల్లా పరిషత్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ ను శిగ విజయలక్ష్మి వీరస్వామి గౌడ్ మా కుమారుడైన శిగ భారత్వాజ్ గౌడు జన్మదిన సందర్భంగా 50 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ సిఐ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి ఉపాధ్యాయులకు తల్లిదండ్రు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కొంగరకలాన్ లో గవర్నమెంట్ మాట్లాడుతూ అమెరికాలో ఎమ్మెస్ చేస్తున్న మన స్కూల్ విద్యార్థులకు సహాయం చేయడం నిజంగా నందనీయమని తెలిపారు. లక్కరాజు రవీందర్ రావు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అమెరికాలో ఎమ్మెస్ చదువుతున్న శిగ భరత్వాజ్ గౌడు కు జన్మదిన శుభాకాంక్షలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని దీవిస్తూ విద్యార్థిని విద్యార్థులు మీరందరూ ఆదర్శంగా తీసుకుని కష్టపడి ఇష్టంగా చదివి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, అడ్వకేట్ ఉన్నత చదువులు చదువుకొని మనకు చదువులు చెప్తున్నా ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువస్తారని ఆశిస్తున్నాను. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు శిగ భారత్వాజ్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిభట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, గోపగళ్ళ మహేందర్, స్కూల్ చైర్మన్ శ్రీమతి సునీత రెడ్డి, మాజీ వార్డ్ నెంబర్ కాకి రవీందర్ ముదిరాజ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఊడుగుల మనోహర్ గౌడ్, కొంగరకలాన్ గౌడ సంఘం అధ్యక్షులు చింతాకుల యాదయ్య గౌడ్, నీళ్ల వెంకటేష్ గౌడ్, గోదాసు రవీందర్ ముదిరాజ్, పలుస పురుషోత్తం గౌడ్, శిగ కుమార్ గౌడ్, గోదాస్ మధు ముదిరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు రామచంద్రయ్య, ఆంజనేయులు, యాదయ్య, దశరథ, పాండు నాయక్, అరుణ, వాణి, సమత తదితరులు పాల్గొన్నారు

# ఈనెల 25 తేదీన తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల మహాసభ

**హైదరాబాద్ వెలుతురు జనవరి 22:** బుధవారం రోజున మధ్యాహ్నం మింట్ కాంపౌండ్ ఆవరణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం నాడు జరగబోయే రాష్ట్ర వార్షికోత్సవ సందర్భంగా నూతన క్యాలెండర్ డైరీ ని ఆవిష్కరింపబడుతుందని రాష్ట్ర అధ్యక్షులు జీ సి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టూరిజం శాఖ మాత్యువర్యులు జూపల్లి కృష్ణారావు. ప్రభుత్వ సలహాదారుడు. కే.కేశవరావు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య. విద్యుత్తు ప్రధాన తనిఖీ అధికారి. సిహెచ్ రామాంజనేయులు. మాస్టర్ ప్లాన్ సిజిఎం. చక్రపాణి. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డ్ కార్యదర్శి. టీ కాంతారావు. కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు మరియు తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మెంబర్ నక్క యాదగిరి. ప్రధాన కార్యదర్శి ఏం శ్రీనివాస్ గౌడ్. ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ. రాష్ట్ర సలాదారుడు. రాజు మహారాజ్. ఏ. మహేందర్. నామిని వెంకటేష్ నేత. తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ కంపెనీ ప్రతినిధులు మరియు తెలంగాణ వ్యాప్తంగా ఉన్నటువంటి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారు కావున అందరూ ఆహ్వానితులే 2025 నూతన సంవత్సరము నకు సంభందించి ఆకర్షణీయ మైన రంగులతో డైరీ స్టేట్ క్యాలెండర్ శనివారం తేదీ 25 ఉదయం 10:00 నుండి సాయంత్రం మూడు గంటల వరకు సభ నిర్వహించబడును.

# సత్తయ్య కుటుంబం కు ఆర్థిక సహాయం అందించిన సురేష్ గౌడ్

- స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజా సేవా కార్యక్రమాలు



**వెలుతురు, సంస్థాన్ నారాయణ పూర్, జనవరి 22:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన రాపోలు సత్తయ్య అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబం కు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు, మృతుడు సత్తయ్య కుటుంబ సభ్యులను స్థానిక బి. ఆర్.ఎస్ పార్టీ నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు,ఈ ఆర్థిక సహాయం కార్యక్రమంలో రాపర్తి కర్ణాకర్ గౌడ్, ఉప్పలఆంజనేయులు, బాకారం నాగరాజు,బొమ్మగోని రమేష్,పేర రమేష్, చేరుపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు,

# రాంగ్ పార్కింగ్ చేస్తే జరీమానాలు తప్పవు

- నెల రోజుల వ్యవధిలో 75 మంది పైన వాహన చోదుకులకు జరీమానలు
- శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి
- సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం




**వెలుతురు న్యూస్ సూర్యాపేట జనవరి 23** ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్సై సాయి రాం హెచ్చరించారు. రోడ్డు భద్రత మాసోత్సవల్లో భాగంగా సూర్యాపేటలో స్థానిక ఈనాడు జంక్షన్ వద్ద వాహన చోదకులకు రాంగ్ పార్కింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, ఓవర్ స్పీడ్, ఇన్సూరెన్స్ లేకపోవడం వంటి కారణాలచే ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలుంటాయని తెలిపారు. వ్యాపారస్తులు, వాహనదారులు పార్కింగ్ కోసం ప్రత్యామ్నాయ స్థలాలను చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కొత్త బస్టాండ్, 60 ఫీట్ రోడ్డు, ఖమ్మం ఎక్స్ రోడ్ పలు ప్రాంతాల్లో ఇరువైపుల ఉన్న వ్యాపారులు తమ కస్టమర్ల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో రోడ్డుపై నిలుపరాదని అన్నారు. వైన్స్, బ్యాంక్, షాపింగ్ మాల్స్ వద్ద రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్నారని అన్నారు. త్రీ వీలర్ అటోలు కూడా రోడ్డు పైనే పార్క్ చేస్తూ రూల్స్ అతిక్రమిస్తున్నారని, నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నెల రోజులుగా రాంగ్ పార్కింగ్ చేసిన 75 మంది పై వాహన చోదకులకు జరిమానాలు విధించినట్లు ఎస్సై సాయిరాం తెలిపారు.శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. పోలీస్ సిబ్బంది, వాహన చోదుకులు ఉన్నారు.

# నిఖిల్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 22** మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన ఎమ్మెల్యే వేముల వీరేశం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మండల ప్రజలు అష్ట ఐశ్వర్యాలతో, సుఖ, సంతోషాలతో ఆరోగ్యంగా ప్రజలు,ఉండాలని కోరుకున్నాడు. భక్తులు ప్రజలు, నాయకులు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు మాజీ వార్డ్ నెంబర్లు పాల్గొన్నారు.

# సత్తయ్య కుటుంబంకు ఆర్థిక సహాయం అందించిన ఉప్పల లింగస్వామి



**వెలుతురు ,సమస్థాన్ నారాయణపురం, జనవరి 22:** సమస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన రాపోలు సత్తయ్య కుటుంబానికి 5,000 వేల ఆర్థిక సహాయంను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి అందించారు, సంస్థాన్నారాయణపురం గ్రామానికి చెందిన భజన కళాకారుడు రాపోలు సత్తయ్య (పద్మశాలి )అకాల మరణం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉప్పల లింగస్వామి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు 5,000 ఐదు వేల రూపాయలఆర్థిక సహాయాన్ని అందించారు, ఈ కార్యక్రమంలో నారాయణపురం గ్రామ మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నర్సింహా,బీసీ సెల్ మండల అధ్యక్షులు రత్తిపెల్లి యాదయ్య, చిలుకూరు శ్రీనివాస్, రాచకొండ రమేష్ బాబు, దూసరి వెంకటేష్ గౌడ్,యువజన కార్యదర్శి ఉప్పల నాగరాజు,సింగం కృష్ణ,గుర్రం సుదర్శన్,రేవనపల్లి గోపాల్,కర్నాటి నవీన్,బద్దుల మురళి,సూరపల్లి భాను ప్రకాష్,సికిలమెట్ల హెమేందర్,ఏలే సతీష్,సుక్క రాములు,కోన్రెడ్డియాదయ్య,,గార్లపాటి వెంకటేష్, చేరిపల్లి అంజయ్య, బకారం శ్రీను, మేకని యాదగిరి, మేకని రామకృష్ణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలో భువనగిరి ఎమ్మెల్యేను అడ్డుకున్న అనంతారం గ్రామ ప్రజలు



**వెలుతురు, యాదాద్రి భువనగిరి జిల్లా, జనవరి 22:** భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని తమకు ప్రభుత్వ పథకాలు ఇవ్వరా అంటూ నిలదీసిన అనంతారం గ్రామస్తులు దీంతో కాంగ్రెస్ పార్టీ నేతలకు ప్రజలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది, దీంతో పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది,యాదాద్రి భువనగిరి మండలం అనంతారం గ్రామ సభలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి పథకాలు రాలేదని, అర్హులకు పథకాలు ఇవ్వరా అని ప్రజలు ప్రశ్నించారు, అయితే ఎ మ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని అనంతారం గ్రామస్తులు అడ్డుకున్నారు, తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తు మాకు ప్రభుత్వ పథకాలు అందిం చాలని డిమాండ్ చేశారు . దీంతో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి న్యాయం చేస్తామని అన్నారు.గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలకు ఎమ్మెల్యే సర్ది చెప్పే ప్రయత్నం చేశారు, అయితే ఎమ్మెల్యే సైతం ప్రజలు తమ సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, కాగా కావాలనే గ్రామ సభలో కొందరు గలాటచేయడం జరిగిందని తెలిపారు, ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందన్నారు,



# అర్హులైన వారు అందరు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

- జాబితాలో పేర్లు లేవని ఆందోళన చేందవద్దు
- మండల తహసీల్దార్ కృష్ణ



సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 22:

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో ప్రజా పాలన లో భాగంగా గ్రామసభ కార్యక్రమంలో రైతు భరోసా ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుపై గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మండల రెవెన్యూ అధికారి స్పెషల్ ఆఫీసర్ కృష్ణ హాజరయ్యి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాను అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి కోరారు. జాబితా చదివి వినిపించారు జాబితాలో పేరు లేని వారు ఆందోళన చెందవద్దు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది అని మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలి అన్నారు.అనంతరం అర్హులైన వారు దరఖాస్తు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ విలేజ్ సెక్రెటరీ కిషన్ నాయక్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ్డం శంకరయ్య,ఎస్కే బడేసాబ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్,కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు మహ్మద్ ఖాలేక్,మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ శంకరయ్య,మాజీ వార్డు సభ్యులు మంచాల ఏసు,కారోబార్ లోడే యాదయ్య, వివిధ పార్టీల నాయకులు,పోలీస్ సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

# విపంచి ఫౌండేషన్ ఆద్వర్యంలో అట్లాసు పుస్తకాల పంపిణీ

- ఇంద్రపాల నగరం జిల్లా పరిషత్ పాఠశాలలో విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్



రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 22

పేద విద్యార్థుల అభ్యున్నతి కోసమే విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ ,మండలం లోని ఇంద్రపాల నగరం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో వెలకుర్తి పుల్లయ్య చారి –కనకమ్మ దంపతులు వెలకుర్తి నారాయణ చారి – వెలకుర్తి పరుషయ్య చారి అనుముల అంతయ్య ల జ్ఞాపకార్థం వారి కుమారులు వెలకూర్తి కుమార చారి , నర్సింహా చారి, సువర్ణా చారి ,చంద్రశేఖర చారి ,అనుముల శ్రీనివాస్ లు సంయుక్తంగా పదవ తరగతి చదివే విద్యార్థులకు రాయల్ అట్లాసు పుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు భవిష్యత్తు నిర్మాణం కోసం దాతల సహకారం తీసుకోవాలని ,అదే విధంగా విపంచి ఫౌండేషన్ ఎల్లప్పుడు స్వయం, సహకారం అందిస్తుందని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అదేవిదంగా హెడ్మాస్టర్ కోటగిరి శేఖర్ సభాధ్యక్షత వహించి మాట్లాడుతూ, విపంచి ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సహకరించడం అభినందనీయమని భవిష్యత్తు లో, మరింత సహకారం అందించాలని కోరారు.ఇంకా ఈ కార్యక్రమంలో వెలకుర్తి కుటుంబ సభ్యులు కుమార చారి ,నర్సింహా చారి ,చంద్రశేఖర చారి ఉపాధ్యాయులు పుట్ట సైదులు ,శ్రీనివాస్ రెడ్డి ,వేణు,అశోక్,ఆల్వాల్ రెడ్డి నిర్మల,లింగాచారి పెంటయ్య ,లక్ష్మి ప్రసన్న గీత ,మణి,ఫౌండేషన్ కొ ఆర్డినేటర్ – బురుగు గోపి కృష్ణ, విశ్వబ్రాహ్మణ మనుమయ గ్రామ శాఖ అధ్యక్షులు అధ్యక్షులు వెలకుర్తి నర్సింహా చారి, ప్రధాన కార్యదర్శి వెలకుర్తి జానాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఈ సారి జాతరలో మున్సిపాల్టీకి టెండర్ల మీద ఆదాయం 68,83,650...

వెలుతురు న్యూస్ సూర్యాపేట జనవరి 23



దురాజ్ పల్లి లింగమంతుల స్వామి జాతర సందర్భంగా సూర్యాపేట మున్సిపాలిటీ వారు పిలిచిన ఎగ్జిబిషన్,చిరు దుకాణంల ఖాళీ స్థలం,మిఠాయి,స్వీట్స్,వరి పేలాలు, బొంగులు,చెరకు గడలు,జాతర చుట్టూ విద్యుత్ సరఫరా కు టెండర్లు పిలువగా అట్టి టెండర్లను టెండరుదార్ల సమక్షంలో మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాస్ టెండర్ బాక్స్ లను ఓపెన్ చేయుట జరిగింది.ఎగ్జి బిషన్ ఐటమ్స్ 15 దరఖాస్తులు జారీ చేయగా 7 మెంబర్స్ టెండర్లు సమర్పించగా అత్యధిక రేటు రూ.35,50,000/- లకు ఎల్. గోపాల్ కృష్ణా టెండర్ దక్కించు కున్నారు. చిరు దుకాణములు,ఖాళీ స్థలం లకు 9 మంది కి దరఖాస్తులు జారీ చేయగా 5 మెంబర్స్ టెండర్లు సమర్పించగా రూ 24,04,650/-లకు మామిడి కిరణ్ టెండర్ దక్కించు కున్నారు,మిఠాయి స్వీట్లకు 8 దరఖాస్తులజారీ చేయగా 4 మెంబర్స్ టెండర్లు సమర్పించగా రూ 6,60,000/- లకు ఎం.ఏ.వాజిద్ మియా టెండర్ దక్కించుకున్నారు,వరి పేలాలు ,బొంగులకు 5 దరకస్తులు జారీచేయగా ఇద్దరు టెండర్లో పాల్గొన్నారు కానీ అంచనా రేటు రూ 3,30,000/- ల కంటే తక్కువ రేటు కోట్ చేసినందున రీకాల్ టెండర్ పిలవడం జరుగుతుంది. చెరకు గడలకు 9 దరఖాస్తులు రాగ ఇద్దరు టెండర్లు వేయగా రూ1,80,000/- లకు ఎండీ నశీరుద్దీన్ టెండర్ దక్కించు కున్నారు.అదే విధంగా జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు 2 దరఖాస్తు లు జారీ చేయగా 1 మెంబర్ టెండర్ సమర్పించి మొండికత్తీ జానకి రాములు 89,000/- లకు టెండర్ ను దక్కించు కున్నారు.2022-2023 జాతరలో మున్సిపాల్టీకి టెండర్ల మీద ఆదాయం రూ 56,43,754 రాగ ఈసారి రూ 68,83,650/- మున్సిపాల్టీకి సమకూరనుంది.

# అన్ని దానలకెల్లా విద్యా దానం గొప్పది

## -డీఈవో సత్యనారాయణ

- సంపాదించిన దాంట్లో కొంత అనాధల, పేదల విద్యాభివృద్ధికి అందజేస్తున్నాము
- రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి





సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 22: సంస్థాన్ నారాయణపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి డీఈవో సత్యనారాయణ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు,గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాధికారి కే. సత్యనారాయణ అన్నారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి సహకారంతో విద్యార్థులకు అల్పాహారం ప్యాకెట్లను అందజేశారు. డీ.ఈ.వో మాట్లాడుతూ అన్నింటికీ మూలం చదువేనని, పట్టుదలతో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. ట్రస్ట్ సమకూర్చిన 50 రోజుల అల్పాహారం సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదవ తరగతి విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువైన అల్పాహారం, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించిన హైదరాబాదుకు చెందిన రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవిని అభినందించి సన్మానించారు.మండల కేంద్రంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానంతరం ఆయన చేతుల మీదుగా జెడ్.పి. ఎచ్.ఎస్ , మోడల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల అల్పాహార ప్యాకెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్త బడుగు శ్రీరాములు మాట్లాడుతూ గ్రామాలు, విద్యార్థులు అభివృద్ధి చెందేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలనికోరారు.తాను ప్రభుత్వం ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయంలో చదువుకున్నానని, తాను సంపాదించిన దాంట్లో కొంత అనాధలకు పేదలకు విద్యాభివృద్ధికి అందజేస్తున్నానని రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి తెలిపారు. పేదరికాన్ని రూపుమాపేది, విద్యార్థుల తలరాతను మార్చేది, బాలల భవిష్యత్తును తీర్చిదిద్దేది చదివేనని తెలిపారు. చదువు విలువ తెలుసుకోవాలని, ఎప్పుడూ ఉన్నత స్థానం కోసం పోటీపడాలని సూచించారు. తాను తన మిత్రులు ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు ద్వారా అనాధలకు నిరుపేదలకు విద్యార్థులకు పాఠశాలకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయిస్తు న్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సేవ చేయాలని కోరారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి గోలి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త సుక్కా సుదర్శన్, జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమాదేవి , ఉషారాణి, హనుమంతు, కే ఉదయ , నర్రా నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దీపా జోషి తదితరులు పాల్గొన్నారు.

## అర్హు లకు సంక్షేమ పథకాలు అంద జేస్తాం...

# ఎవ్వరూ అధైర్య పడవద్దు

- జేపల్లిలో నిర్వహించిన గ్రామస భలో చారకొండ మండల తహశీల్దార్ సునిత
- తమ పేర్లు రాలేదని అధికారు లతో గ్రామస్థులు వాగ్వాదం..

వెలుతురు, చారకొండ 22, జనవరి: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజే స్తామని చారకొండ మండల తహశీ ల్దార్ సునిత అన్నారు. ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు రేషన్ కా ర్డులు, ఆత్మీయ భరోసా, రైతు







భ రోసా, ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారందరికీ అందజేస్తామని, ఎవ్వ రూ అధైర్య పడవద్దని ఆమె సూ చించారు. చారకొండ మండలంలో ని జేపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మా ట్లాడారు. రేషన్ కార్డులో పేర్లు లేని వారు కొత్తగా దరఖాస్తు చేసు కోవా లని కోరారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే అందాలని ఉద్దేశంతో అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి అర్హులైన వారి జాబితా రూపొందించాలని పేర్కొన్నా రు. ఇంకా ఎవరైనా నిజమైన లబ్ధి దారులు ఉంటే మండలంలోని ఎం పీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రి య అని తెలిపారు. జనవరి 26న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపి క చేసి లబ్ధిదారులను అందజేస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ దివ్య, సీనియ ర్ అసి స్టెంట్ శ్రీను నాయక్, ఏపీఓ లక్ష్మ య్య, ఏఇఓ సుష్మా తదితరులు పాల్గొన్నారు.

### అధికారులతో గ్రామస్థులు వాగ్వాదం..

గ్రామసభలో అధికారులతో గ్రామ స్థులు వాగ్వాదానికి దిగారు. అధి కారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా చదువుతుండగా గ్రామ స్థులు తమ పేర్లు జాబితాలో లేకపో వడంతో ఒక్కసారిగా అధికారులతో వాగ్వాదానికి దిగారు. జాబితాలో పేర్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తె లిపారు.

# నాలుగవ తరగతి విద్యార్థులకు గురుకుల స్టడీ మెటీరియల్ అందజేత

- విద్యార్థులకు ఆసరా అవుతున్న ఆసరా ఫౌండేషన్
- మౌలిక సదుపాయాల కోసం దాతలు ముందుకు రావాలి



రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 22

మండలం ప్రాథమిక పాఠశాల కక్కిరేణి గ్రామంలో ఆసరా ఫౌండేషన్ అధ్యక్షులు మేడి హరికృష్ణ నాలుగవ తరగతి విద్యార్థులకు గురుకుల పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్ ని అందించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ఉపాధ్యాయులు గణేష్ మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధి కొరకు ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు మరెన్నో రకాలుగా.. విద్యార్థులకు సహాయ సహకారాలు గ్రామ పెద్దలు యువకులు ముందుకు వచ్చి మౌలిక సదుపాయాలతో పాటు పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతుగా దాతలు కృషీ చెయ్యాలని కోరారు. అలాగె ఆసరా ఫౌండేషన్ అధ్యక్షులు మేడి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్ ని ఉపయోగించుకొని గురుకుల పరీక్షల్లో మంచి ప్రతిభ చూపించి మంచి పాఠశాలలో సీటు సాధించాలని అదేవిధంగా మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని కోరడం జరిగింది.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి , కృష్ణ , స్వర్ణలత , సామజిక కార్యకర్త వేముల సైదులుతో పాటు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

వెలుతురు , యాదగిరిగుట్ట, జనవరి 22

ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందని ప్రజా పాలన సదస్సులలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారికి అన్ని రకాల సంక్షేమ అభివృద్ధి పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజాపాలన సదస్సు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రజలందరికీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు, రైతు బీమా రైతు భరోసా ఇతర సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేయకపోగా తమ స్వలాభమే చూసుకున్నారని విమర్శించారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు ప్రజా పాలన సదస్సులలో ప్రజలు పెట్టుకున్న ప్రతి అర్జీని పరిశీలించి వారికి తగిన విధంగా న్యాయం చేస్తామని అన్నారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని అన్నారు . అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తామని రేషన్ కార్డులలో మిగిలిన కుటుంబ సభ్యులను చేర్చే ప్రక్రియను కూడా కొనసాగిస్తున్నామని అన్నారు ప్రజా ప్రభుత్వంలో ప్రజలంతా ఆనందంగా ఉన్నారని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజలను అన్ని విధాలుగా సంతృప్తి పరుస్తున్నామని అన్నారు రైతులకు రైతు బీమా రైతు భరోసా రుణమాఫీ అందిస్తున్నామని అన్నారు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు ఈ సందర్భంగా ప్రజా పాలన సదస్సులో వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు అంతకుముందు యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుడుగు శ్రీనివాస్ రెడ్డి మొలుగు శ్రీరాములు, బబ్బురి శ్రీధర్ గౌడ్, ఎర్రగుంట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు వరం CMRF

- అనంత చంద్ర శేఖర్ గౌడ్





**చండూర్ వెలుతురు జనవరి 22:**
బుధవారం రోజున గౌరవ శాసనసభ్యులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 3 మంది లబ్దిదారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ అద్వర్యంలో మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ దొటి సుజాతవెంకటేష్ యాదవ్, కోడి శ్రీనివాసులు చేతులమీదుగా

1. సిహెచ్. శ్రీనివాసులు 60,000,
2. సిహెచ్. వెంకన్న 42000,
3. ఏ.యాదయ్య 46,500, వచ్చిన చెక్కులను లబ్ధిరులకు ఉదయం 11 గంటలకు అ%శీ%దించడం జరుగుతుంది కార్యక్రమంలో నల్లగంటి మల్లేశం మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ విలువలను కాపాడుతున్న యూనియన్..

**టీయూడబ్ల్యూజే ఐజేయు డైరీ ని ఆవిష్కరించిన ఎస్పీ రోహిత్ రాజ్..**



**భద్రాద్రి కొత్తగూడెం వెలుతురు జనవరి 22:**
జర్నలిస్టు విలువలను కాపాడుతున్న యూనియన్ గా టీయూడబ్ల్యూజే ఐజేయు మరింత ముందుకు సాగాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో టియుడబ్ల్యూజే ఐజేయు డైరీ ని ఆవిష్కరించారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై టి యు డబ్ల్యూ జే ఐజేయు యూనియన్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జర్నలిస్టు విలువలను కాపాడేందుకు మరింత చైతన్యవంతమైన కార్యక్రమాలను సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్న టియుడబ్ల్యూజే ఐజేయు బృందాన్ని అభినందించారు. జిల్లాలోని జర్నలిస్టులకు సంబంధించి లా అండ్ ఆర్డర్ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎర్ర ఈశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పుల సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి శంకర్, దశరథ రజువా తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ లో 28 న బిఆర్ఎస్ మహా ధర్నా

**- బీఆర్ఎస్ రాష్ట్ర నేత సుర్వి యాదయ్య గౌడ్**



**వెలుతురు, హైదరాబాద్, జనవరి 22:**
నల్గొండ లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే రైతు మహా ధర్నా కార్యక్రమానికి హై కోర్టు అనుమతి ఇచ్చిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, తాజా మాజీ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు, నల్గొండ లో ఈనెల 28 న మహా ధర్నా కార్యక్రమం ను విజయవంతంగా నిర్వహిస్తామని యాదయ్య గౌడ్ తెలిపారు,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని యాదయ్య గౌడ్ ఆరోపించారు, నేడు గ్రామాలల్లో జరుగుతున్న గ్రామ సభలను ప్రజలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు, ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం కు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని యాదయ్య గౌడ్ తెలిపారు, కెసిఆర్ రైతును రాజు ను చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు అండగా ఉంటామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందని యాదయ్య గౌడ్ విమర్శించారు , ఈ ప్రభుత్వం కు దిమ్మ తిరుగే విధంగా నల్గొండ లో మహా ధర్నా కార్యక్రమం జరుగుతుందని యాదయ్య గౌడ్ తెలిపారు,

# దిగ్వాల్ గ్రామ శివారులోని గుడిలో జరిగిన చోరీను చేదించిన కోహిర్ పోలీసులు...

- ఎస్ఐ సతీష్ కోహిర్



జహీరాబాద్ వెలుతురు జనవరి 22:
కోహిర్ మండలం దిగ్వాల్ గ్రామ శివారులోని కాశీ విఠలేశ్వర పుణ్యక్షేత్రం గుడిలో ఆదివారం జరిగిన చోరీను కోహిర్ పోలీసులు చేదించారు. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కవేలి ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నా క్రమంలో ఝరాసంగం మండలం చిలుకపల్లి గ్రామానికి చెందిన గొల్ల శ్రీకాంత్ తండ్రి గొల్ల వెంకటేశం ను విచారించగా దిగ్వాల్ గుడిలో దొంగతనాన్ని పాల్పడినట్టుగా అతడు ఒప్పుకున్నాడని వారు తెలిపారు.

# నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి

- **జహీరాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నరసింహ రెడ్డి**

**జహీరాబాద్ వెలుతురు జనవరి 22:**
నిరుపేదలకు ముఖ్య మంత్రి సహాయ నిధి అండగా



ఉంటుందని జహీరాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నరసింహ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి , పార్లమెంట్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ నాయకులు అక్బర్ హుస్సేన్, జహీరాబాద్ మండలం మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ కుమార్ లతో కలిసి ఆనగుంట గ్రామం ఒంటెలగడ్డ తండాకు చెందిన రాథోడ్ అనే లబ్ధిదారునికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైనా 60 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చెక్కును అందుకున్న లబ్దిదారుడు సీఎం రేవంత్ రెడ్డికి, సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డికి, పార్లమెంట్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డికి, జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

# రోడ్డు భద్రతపై కళాశాల విద్యార్థులకు ఎస్ఐ కాశీ నాథ్ అవగాహనా



**జహీరాబాద్ వెలుతురు జనవరి 22:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా స్థానిక పట్టణ ఎస్ ఐ ఎం కాశీ నాథ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని తెలిపారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి రూల్స్ ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్, లెక్చరర్స్, స్థానిక పోలీస్ సిబ్బంది, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి

- **ఎల్ ఐ సి ఉద్యోగ సంఘం నాయకుల డిమాండ్...**

**జహీరాబాద్ వెలుతురు జనవరి 22:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఎల్ ఐ సి కార్యాలయం గేట్ ఎదుట తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించక పోవడం పట్ల ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ జహీరాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘానికి చట్ట బద్ద గుర్తింపు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న క్లాస్ -3, క్లాస్-4 ఉద్యోగుల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు భీమా మొత్తం పై చెల్లిస్తున్న జిఎస్టి ని ఎత్తివేయాలని అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు మాణయ్య,




సాయి హరి, చంటి, బి అశోక్, రాజ్ శేఖర్, రామ కృష్ణ, నర్సిములు, మధు సూధన్, విష్ణు, మార్కండేయులు జె, జమున తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎంపికలు ప్రజల అసంతృప్తి



**కొల్చారం, వెలుతురు న్యూస్ జనవరి 22:**
మండలంలో కొంగోడు, నైజలాల్పూర్, పోతిరెడ్డిపల్లి, రాంపూర్ వరిగుంతం మాందాపూర్ గ్రామాలలో బుధవారం అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించారు. కొంగోడు గ్రామసభకు డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్ ప్రత్యేక అధికారిగా హాజరవగా, నైన్ జలాల్పూర్ గ్రామ సభకు మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి, ఏపీవో మహిపాల్ రెడ్డి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. పథకాలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాలో తమ పేర్లు కనిపించకపోవడంతో అసంతృప్తికి లోనైనా పలువురు అధికారులను సభాముఖంగా నిలదీశారు. కొంగోడు గ్రామానికి చెందిన చాకలి మంజుల మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇల్లు మంజూరు చేస్తామని చెప్పి ఇప్పుడు జాబితాలో తమ పేరు లేదంటున్నారని వాపోయారు. ఇదేవిధంగా నైన్ జలాల్పూర్ లో లంబాడి కున్య తనకు బోరు లేదు, భూమి లేదు అయినప్పటికీ తనను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. అనంతరం కొంగోడు మాజీ సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చెప్పింది ఒకటి చేస్తున్నది ఒకటి అని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ చేయలేదన్నారు.



## తెలంగాణకు

# రూ.45,500 కోట్ల భారీ పెట్టుబడి

- **ప్రభుత్వంతో సన్ పెట్రో కెమికల్స్ ఎంవోయూ**
- **సన్ పెట్రో కెమికల్స్ ప్రాజెక్టులతో 7వేల మందికి ఉద్యోగాలు**



**హైదరాబాద్,జనవరి22( వెలుతురు):**
తెలంగాణలో భారీ పెట్టుబడులపై దావోస్‌లో మరో కీలక ఒప్పందం జరిగింది. రూ.45,500 కోట్ల పెట్టుబడులతో సన్ పెట్రో కెమికల్స్ ఎంవోయూ చేసుకుంది. భారీ పంప్డ్ స్టోరేజీ పవర్, సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుపై ఒప్పందం జరిగింది. రాష్ట్రంలోని నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగు ప్రాంతాల్లో ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. సన్ పెట్రో కెమికల్స్ ప్రాజెక్టులతో 7వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో మూడో రోజు తెలంగాణకు భారీగా పెట్టుబడులు వచ్చాయి. సన్ పెట్రో కెమికల్స్ సంస్థ తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. తెలంగాణలో రూ.45,000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు ఆ సంస్థ అంగీకరించింది. ఈ మేరకు దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వంతో సన్ పెట్రో కెమికల్ సంస్థ ఎంవోయూ చేసుకుంది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్తు, సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ ఒప్పందంతో దాదాపు రాష్ట్రంలోని 7,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇప్పటివరకు దావోస్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే కావడం గమనార్హం. రాష్ట్రానికి భారీ పెట్టుబడి రావడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, తెలంగాణ అధికారుల బృందం సంతోషం వ్యక్తం చేసింది. దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ బృందం వెళ్లిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ టీమ్ వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతున్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పించే రాయితీల గురించి కంపెనీలకు వివరిస్తున్నారు. ఇప్పటికే యూనీ లివర్, స్కైరూట్, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ సంస్థ వంటి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తాజాగా సన్ పెట్రో కమికల్స్ సంస్థ కూడా భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది.

## :రెండో రోజు రాష్ట్రంలో

# విజయవంతంగా గ్రామసభలు

- **గ్రామ సభల్లో పాల్గొన్న పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు**
- **60 శాతం గ్రామ/వార్డు సభలు విజయవంతగా పూర్తి**

**హైదరాబాద్,జనవరి22( వెలుతురు):**
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సభలు విజయవంతంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 60 శాతం గ్రామ/ వార్డు సభలు, 9844 గ్రామాలలో విజయవంతంగా నిర్వహించారు. ఈ గ్రామ సభలలో ఆ నాలుగు పథకాలకు సంబంధించి ఇప్పటి వరకు 10 లక్షల 9 వేల 131 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26వ తేదీ న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డుల పథకాలను లాంఛనంగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు గాను గ్రామాలలో, పట్టణ ప్రాంతాలోని వార్డులలో సభలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ సభలలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ దరఖాస్తులను అధికారులకు అందచేస్తున్నారు. ఈనెల 21 నుండి 24 వరకు కొనసాగే ఈ గ్రామ సభలలో భాగంగా రెండోవ రోజు బుధవారం 3608 గ్రామ సభలు, 1055 వార్డు సభలు మొత్తం కలపి 4663 గ్రామ/వార్డు సభలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్రంలోని రూరల్ ఏరియాలలో 12,914 గ్రామ సభలు, పట్టణ ప్రాంతాల్లో 3484 వార్డ్ సభలు, మొత్తం 16,398 గ్రామ, వార్డు సభలు నిర్వహించాల్సి ఉన్నది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రాష్ట్ర మంత్రులు గ్రామ సభల్లో పాల్గొన్నారు. రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలలో పాల్గొన్నారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా మహబూబ్ నగర్ జిల్లాలో నిర్వహించిన గ్రామ సభలలో పాల్గొన్నారు. వీరితోపాటు, పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు ఈ గ్రామ సభలకు హాజరయ్యారు.

# అర్హులైన ప్రతి పేదవాళ్ళకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి....

● న్యాల్కల్ మండల బిజెపి అధ్యక్షులు మల్లేష్ గంగ్వార్...



**జహీరాబాద్ వెలుతురు జనవరి 22:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని న్యాల్కల్ మండలం గంగ్వార్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో స్థానిక మండల బిజెపి అధ్యక్షులు మల్లేష్ గంగ్వార్ సందర్శించారు. అర్హులైన ప్రతి పేదవాళ్ళకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని వారు ప్రభుత్వాధికారులను కోరారు. ఏ ఒక్క పేద వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని యెడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వారితపాటు న్యాల్కల్ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో ఘనంగా 25వ పాత పంటల జాతర

● ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ ఎస్ఐ కాశీ నాథ్..



**జహీరాబాద్ వెలుతురు జనవరి 22:**
డీడీఎస్ పస్తాపూర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ పాత పంటల జాతరలో భాగంగా బుధవారం జహీరాబాద్ పట్టణంలో కెఫే గ్రీన్ ఎత్నీకు లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ ఎస్.ఐ. కాశీనాథ్ బండ్లకు పూజలు చేసి జాతరను ప్రారంభించడం జరిగింది. జాతరలో భాగంగా ఆటపాటలతో, విత్తనాలతో అలంకరించిన బండ్ల ఊరేగింపు కెఫే గ్రీన్ ఎత్నీక్ నుండి రామానగర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో డిడియస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. దివ్య, జాతర కోఆర్డినేటర్లు వినయ్ కుమార్, మంజుల, మరియు డిడియన్ సిబ్బంది అల్గోల్ సర్సమ్మ, జనరల్ నర్సమ్మ, చిన్న సర్పము, పూలమ్మ, అనురాధ, విజయలక్ష్మి, చుర్యమ్మ, శ్రీలయ, బాలయ్య, ఆర్సీములు, ప్రహ్లాద్, సంపత్, కార్యకర్తలతో పాటు డిడియస్- కెవికె శాస్త్రవేత్త వి. రమేష్ పాల్గొన్నారు.

# సీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

● సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్...




**జహీరాబాద్ వెలుతురు జనవరి 22:**
ప్రజాపోరాటల సారధి, ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలతో అనేక విజయాలు సాధిస్తున్న సిపిఎం పార్టీ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 25-28 వరకు సంగారెడ్డిలో జరుగుతున్నాయని, మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ పిలుపునిచ్చారు. బుధవారం సిపిఎం మహాసభల ప్రచార జాతార ముగింపు సభ జహీరాబాద్ పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్స్ కు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజలను, కార్మికులను మోసం చేస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వేల కోట్లను కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ పేదలకు మాత్రం మొండి చేయి చూపడం సరైనది కాదని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా యాజమాన్యాలకు వత్తాసు పలకడం అలవాటుగా మారిందని వీటన్నింటిపై సీపీఎం ఉద్యమాలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం..నర్సింలు, సీపీఎం జహీరాబాద్ ఏరియా కార్యదర్శి బి.రాంచందర్, కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్, కౌడి నర్సింలు, చంద్రన్న, వీరయ్య గౌడ్, నాయకులు సలీమొద్దిన్,రాజిరెడ్డి, ముజాహెద్, ముతబీర్, శాంతమ్మ, తదితరులున్నారు.

## లోన్‌యాప్ వేధింపులకు యువకుడు బలి

**హైదరాబాద్,జనవరి22( వెలుతురు):**
లోన్ యాప్ వేధింపులతో యువకుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటనా బాల నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వినాయక నగర్లో నివాసముండే లక్ష్మారెడ్డి కుమారుడు తరుణ్ రెడ్డి (21) బిటెక్ పూర్తి చేసి ఉద్యోగం లేక లోన్ యాప్ లలో డబ్బులు తీసుకున్నాడు. సమయానికి డబ్బులు కట్టలేదు. దీంతో యాప్ నుంచి వేధింపులు ఎక్కువైనాయి. వేధింపులు తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఏడాది కింద స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయి..? మూలకు పడేసినట్టేనా..!?

● కుల గణ సర్వే తో సేకరించిన డేటా ఏమైంది...?

● కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన వారికే పథకాలన్నప్పుడు ఈ నాటకాలు దేనికి.....

● ప్రజాపాలన గ్రామసభ దరఖాస్తుల స్వీకరణ కేవలం లోకల్ ఎలక్షన్స్ స్టంట్ మాత్రమే....

● కాంగ్రెస్ ఏడాది గా దరఖాస్తులను స్వీకరిస్తూ టైంపాస్ పాలన చేస్తుంది... జనాలను గోసపెడుతుంది...

● బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర..

**కరీంనగర్ వెలుతురు జనవరి 22:**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా పాలన పేరిట స్వీకరించిన దరఖాస్తులు ఏమయ్యాయని..? ఇటీవల కుల గణన సర్వే పేరిట స్వీకరించిన డేటా ఏమైందని..? ఏడాదికాలంగా ఎన్ని ప్రజాపాలన అప్లికేషన్లు పరిష్కరించారో చెప్పకుండా మళ్లీ ప్రజా పాలన దరఖాస్తుల పేరిట గ్రామ సభలు నిర్వహించి ఏం చేస్తారని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర ప్రశ్నించారు. బుధవారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంగా వివిధ పథకాలకు దరఖాస్తులు స్వీకరించడం, అర్హులను , లబ్ధిదారులను సంబంధిత కార్యాలయాల చుట్టూ తిప్పిస్తూ జనాలతో ఆటలాడుకుంటుందని ఆయన మండిపడ్డారు.



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రజాపాలన పేరిట దరఖాస్తులను స్వీకరించి వాటిలో ఏ ఒక్కరి అప్లికేషన్ అయిన పరిష్కరించకుండా అటకెక్కించిందన్నారు. మళ్లీ కుల గణన సర్వే పేరిట కుటుంబ పూర్తి డేటాను సేకరించి , ఇందులో కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన వారికి రేషన్ కార్డులను ఇచ్చిందని ఆయన ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ సర్కార్ రైతు రుణమాఫీ కొందరికే చేసి , రుణమాఫీ కాని రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో తిరిగేలా చేసిందని, సంబంధిత వివరాలతో అప్లికేషన్ లు తీసుకొని నేటికీ అనేకమంది రైతులకు రుణమాఫీ చేయకుండాగోసపెడుతుందన్నారు. దరఖాస్తులు , ప్రజల డేటాను స్వీకరించి కాంగ్రెస్ ఏడాది కాలంలో సాధించిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే బాహాటంగా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులకే పథకాలు ఇస్తామని బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నప్పుడు దరఖాస్తుల స్వీకరణ ఎందుకని ఆయన ప్రశ్నించారు. అసలైన అర్హులకు, లబ్ధిదారులకు న్యాయం చేయకుండా వాళ్లను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం ప్రజా పాలన పేరిట ఏర్పాటుచేసిన గ్రామసభల్లో గతంలో ఎంతమంది వివిధ పథకాల కోసం ప్రజాపాలన దరఖాస్తులు పెట్టుకున్నారో వారి పేర్లను కూడా గ్రామ వార్డు సభల్లో అధికారులు చదవాలన్నారు. మళ్లీ ప్రజాపాలన కొత్త దరఖాస్తులు ఎందుకో కూడా చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు వీటికి సమాధానం చెప్పకుండా కేవలం దరఖాస్తులు స్వీకరించే ప్రయత్నం చేస్తుందని, ఇది కేవలం రాబోయే లోకల్ ఎలక్షన్ ను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న నయా డ్రామా మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంగా ప్రజల సమస్యలను పరిష్కరించకుండా దరఖాస్తుల స్వీకరంతో టైంపాస్ పాలన కొనసాగిస్తుందని ఆయన ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు.

# క్షేత్రస్థాయిలోనే లబ్ధిదారుల ఎంపిక

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయశంకర్ భూపాలపల్లి, జవవరి 22:**
సంక్షేమ పథకాలు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హులను ఎంపిక చేసేందుకు ప్రజల సమక్షంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం చిట్యాల మండలం చల్లగరిగ, రేగొండ మండలం సుల్తాన్ పూర్, గణపురం మండలం కర్కపల్లిలో జరిగిన ప్రజాపాలన .. గ్రామసభల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీకి ఈ నెల 16 నుండి 20వ తేది వరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారని అట్టి జాబితాను ఫైనల్ చేయుటకు ప్రజల అభిప్రాయాలు సేకరణకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రజల. మధ్యలో ఎంపిక జరగాలని నిష్పక్షపాతంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పథకాల అమలులో భాగంగా 21 నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో గ్రామస్తులను, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేస్తున్నామని అన్నారు. ఏటా నియోజకవర్గానికి 3500 ఇళ్ళు ఇస్తున్నామని, ఇలా రానున్న నాలుగేళ్ల కాలంలో ప్రతి పేదవాని సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా ఉండటానికి గూడు లేని నిరుపేదలకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. జాబితాలో పేర్లు రాని అర్హులైనవారు గ్రామ సభల్లో కానీ ఎంపీడీవో కార్యాలయంలో కానీ దరఖాస్తులు ఇవ్వాలని అట్టి దరఖాస్తులను విచారణ నిర్వహించి వారికి



సంక్షేమ కార్యక్రమాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని సూచించారు. పథకాలు అమలు అనేది నిరంతర ప్రక్రియ అని ప్రజలు సహకారం అందించాలని సూచించారు. గత పది సంవత్సరాలు కాలంలో ఒక రేషన్ కార్డు ఇవ్వలేదని కానీ తమ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టిన వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న ఉగాది నుండి సన్న బియ్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సన్నవడ్లకు 500 రూపాయలు బోనస్ కూడా ప్రభుత్వం చెల్లిస్తున్నదని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రోజుకు 18 గంటలు పనిచేస్తున్నట్లు ఆయన వివరించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ధరణి ద్వారా జరిగిన తప్పులను సరి చేసేందుకు భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు తీసుకొచ్చిందని తద్వారా క్షేత్రస్థాయి విచారణలో గుర్తించిన అన్ని వ్యవసాయ భూములకు రైతు భరోసా చెల్లిస్తామని తెలిపారు. ఈ నూతన చట్టం ద్వారా వ్యవసాయ యోగ్యమైన భూములకు సంవత్సరానికి 12 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం పనులను ప్రామాణికంగా తీసుకొని సంవత్సరానికి 12 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. గ్రామసభల్లో ప్రజలు తమ అభ్యంతరాలు తెలియజేయాలని ఆయన సూచించారు. పేద వర్గాలు చాలామంది ఉన్నారని రానున్న నాలుగు సంవత్సరాలు కాలంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అదే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 21 వేల కోట్ల రూపాయలు రైతులకు రుణమాఫీ చేసి దేశంలో ఏ ప్రభుత్వం చేసినటువంటి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలకు జవాబు దారితనంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 55 వేల ఉద్యోగాలు నియమాకం చేశామని ఆయన తెలిపారు. ఇప్పటివరకు పట్టాదారు పాసుపుస్తకాలు లేని రైతులకు త్వరలోనే పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని తద్వారా బ్యాంకు నుండి రుణాలు, రైతు భరోసా వంటి పథకాలు ద్వారా ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పథకాలు అమలు అనేది నిరంతర ప్రక్రియనని ప్రజల ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఏదైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు చిన్నయ్య, డాక్టర్ కుమారస్వామి, తహసిల్దార్లు హేమ, సత్యనారాయణ స్వామి, ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు కిష్టన్న, శ్రీదేవి, సింగిల్ విండో చైర్మన్ విజ్జనరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

# కులగణన సర్వే ఆధారంగానే రేషన్ కార్డులు

**కరీంనగర్, జనవరి 22 వెలుతురు:**
రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కులగణన సర్వే ఆధారంగా జారీ చేయనున్నారు. అయితే కులగణనలో ఖచ్చితత్వం ఎంత? అన్న దానిపైనే ఇప్పుడు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇళ్లకు వచ్చి యజమానులు చెప్పిన వివరాల ఆధారంగానే నమోదు చేసుకుని సర్వే సిబ్బంది వెళ్లారు. అయితే ఇది ఖచ్చితమైన సమాచారం అనేది మాత్రం క్లారిటీ లేదు. కొందరు పొలాలు, ఆస్తులను దాచి ఉంచారన్న కామెంట్స్ కూడా వినిపించాయి. ప్రభుత్వ పథకాలు తమకు అందవన్న భయంతోనే ప్రజలు తమ ఆస్తుల విషయాన్ని బయటపెట్టలేదని కూడా వార్తలు వచ్చాయి. అదే సమయంలో సిబ్బంది కూడా తూతూమంత్రంగా చేసిన ఈ సర్వే ప్రాతిపదికన రేషన్ కార్డులు మంజూరు చేస్తే ఎలా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతుంది. కులగణన లో అనేక ప్రశ్నలు వేశారు. యాభైకి పైగా ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడంలో సర్వే సిబ్బంది యాంత్రికంగానే వ్యవహరించారు. కనీసం వారి ఆదాయం గురించి కూడా ఆరా తీయలేదు. దీనివల్ల అనర్హులు ఎక్కువ మంది తెలుపు రంగు రేషన్ కార్డులు పొందే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. రేషన్ కార్డుల జారీకి కులగణన సర్వే ప్రాతిపదిక కాకూడదు. దానికి నిబంధనలు వేరుగా ఉంటాయి. ఆదాయ పరిమితితో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించడానికి అనేక మార్గాలున్నాయి. ఇప్పుడు తెలంగాణ జరిగిన కులగణన వల్ల ఖచ్చితమైన సమాచారం వచ్చిందన్న నమ్మకం ఎవరికీ లేదు. మరి దాని ప్రాతిపదికన ఎలా రేషన్ కార్డులు మంజూరు చేస్తారన్న ప్రశ్నకు పాలకుల వద్ద సమాధానం లేదు.పాత రేషన్ కార్డులను కూడా తొలగించే ప్రసక్తి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈనెల 26 నుంచి తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ జరగనుంది. రేషన్‌కార్డుల ఫైనల్ లిస్ట్ ను దాదాపు అధికారులు సిద్ధం చేశారు. కులగణన సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు కూడా ప్రకటించారు. కొత్తగా ఆరున్నర లక్షల రేషన్‌కా ర్డులు ప్రభుత్వం జారీ చేసే అవకాశముందని కూడా చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను కూడా గ్రామసభలో నిర్ధారించి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయంతీసుకుందని చెబుతున్నారు.



రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని కూడా ప్రకటన చేసింది. అయితే అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని, అనవసరంగా ప్రజా ధనం దుర్వినియోగం చేసేలా కేవలం కులగణన సర్వేపై ఆధారప డవద్దన్న సూచనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మరి ఈ ప్రక్రియ సజావుగా సాగుతుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది. గ్రామ సభల్లో ఎంపిక: ఈ నెల 26న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభమవుతాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలుచేస్తున్నామన్నారు. వ్యవసాయ భూములు ఉన్న ప్రతి రైతుకు ఎకరానికి రూ.12,000, భూమిలేని నిరుపేద రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12,000 ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు.గ్రామసభలలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లబ్ధిదారుల జాబితా ఎక్కడో రూపొందించకుండా, గ్రామసభలలోనే ఖరారు చేస్తామన్నారు. ఎర్రుపాలెంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామన్నారు. చెరువులు, అడవులను రక్షిస్తూ ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ఇంకా ఎలాంటి జాబితాలు తయారు కాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. లబ్ధిదారుల జాబితా గ్రామాల్లోనే తయారవుతుందని పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భట్టి విక్రమార్క ప్రారభించారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామని భట్టి హామీ ఇచ్చారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రజలందరి సమక్షంలోనే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభలలో నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు.తెలంగాణలో మరోసారి రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా ప్రభుత్వం దరఖాస్తులను తీసుకున్నప్పటికీ? వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే ఇటీవలే నిర్వహించిన కుటుంబ సర్వే ఆధారంగా? రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించినట్లు సర్కార్ ప్రకటించింది. ఈ సర్వే ఆధారంగానే ప్రాథమిక జాబితాలను సిద్ధం చేసింది. వీటిని పౌరసరఫరాల శాఖ గ్రామాల వారీగా విభజించి విడుదల చేసింది.ప్రాథమిక జాబితాలు విడుదల కావటంతో గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమ పేర్లు లేదని పలువురు వాపోతున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని? అయినా తమ పేర్లు లేదని చెబుతున్నారు. కొత్త రేషన్ కార్డు జాబితాలు రావటంతో ప్రజల్లో అనేక అపోహాలు నెలకొన్నాయి. అయితే వీటిపై సర్కార్ క్లారిటీ ఇచ్చింది. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా ఉంటుందని స్పష్టం చేసింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను జారీ చేస్తామని చెప్పింది.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొత్త రేషన్ కార్డు రైతు భరోసా ల పథకాలు సక్రమంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్





**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 22:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలనలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు దఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ది దారరులందరికి న్యాయం చేయాలని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొత్త రేషన్ కార్డు రైతు భరోసా ల పథకాలు సక్రమంగా నిర్వహించాలా లేనిచో ప్రజలా తరుపునప్రభుత్వం పై పోరాటం చేస్తాము అని పాయల్ శంకర్ గారు అన్నారు.

## అప్పుడు ఐటీ...ఇప్పుడు ఏఐ

(మొదటి పేజీ తరువాయి..)
చంద్రబాబు గుర్తు చేశారు. దక్షిణ భారత్‌లో గేట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలకు ఏపీని గేట్‌వేగా నిలపాలని లోకేశ్ కోరారు. శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఏర్పాటు చేయబోతున్న వరల్డ్ క్లాస్ ఏఐ యూనివర్సిటీ సలహామండలిలో భాగస్వాములు కావాలని కోరారు. సీఈవో హెల్త్ ఇన్నొవేషన్, డయాగ్నస్టిక్స్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఆఫ్రికా తరహాలో హెల్త్ డ్యాష్‌బోర్డ్‌ల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. బిల్‌గేట్స్ సలహాలు రాష్ట్ర ఐటీ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. చాలాకాలం తర్వాత చంద్రబాబును కలవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా బిల్‌గేట్స్ అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సహచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బిల్‌గేట్స్‌తో భేటీపై సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. '1995లో ఐటీ, 2025లో ఏఐ అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిను చాలా కాలం తర్వాత కలవడం ఆనందంగా ఉందని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తన సహచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతకుముందు బిల్స్ గేట్స్‌తో సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బిల్స్ గేట్స్‌తో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తమపై నమ్మకంతో మైక్రోసాఫ్ట్ కేంద్రాన్ని నెలకొల్పడం ద్వారా హైదరాబాద్ రూపురేఖలు మారి పోయిన విషయాన్ని ఈ సందర్భంగా బిల్ గేట్స్‌కు గుర్తు చేశారు. అలాగే దక్షిణ భారతదేశంలో బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గేట్‌వేగా నిలపాలని కోరారు. ఇక శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలను అందించాలని బిల్స్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.ఁరాష్ట్రంలోని ఇన్నొవేషన్ ఇంక్యుబేషన్ ఎకో సిస్టమ్‌ను నడపడానికి ఆఫ్రికాలో హెల్త్ డ్యాష్ బోర్డ్‌ల తరహాలో సామాజిక వ్యవస్థాపకతలో ఫౌండేషన్ తరపున నైపుణ్య సహకారాన్ని సైతం అందించాలంటూ బిల్స్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు కోరారు. మీ సహకారంతో స్థానికంగా ఉత్పత్తులపై ప్రపంచ ఆవిష్కరణలను అమలు చేసేలా తమ ప్రభుత్వం పని చేస్తుందని బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

## భార్యను చంపిన కసాయి భర్త

- **శవాన్ని ముక్కలుగా కోసి కుక్కర్‌లో ఉడికించి..**
- **చూర్ణం చేసి.. చెరువులో కలిపిన కిరాతకుడు**

**హైదరాబాద్,జనవరి22 వెలుతురు :**



కలకాలం తోడుండాల్సిన భర్తే కసాయి మారాడు. భార్యని అత్యంత దారుణం గా హత్య చేశాడు. ఏమీ తెలియనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనను పూర్తిగా విచారించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. ఈ ఘటన రాచకొండ కమిషనరేట్ మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త, ఆమెను ముక్కలుముక్కలు నరికి హత్య చేశాడు. అంతటితో ఆగకుండా డెడ్‌బాడీని కుక్కర్‌లో ఉడికించాడు. మిగతా శరీర భాగాలను జిల్లెల్లగూడ చందన చెరువులో పారేశాడు. ప్రకాశం జిల్లా జేపీ చెరువుకు చెందిన గురుమూర్తి మాజీ సైనికుడు. వృత్తి రీత్యా డీఆర్డీవోలో ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ పని చేస్తున్నాడు. జిల్లెల్లగూడలోని న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీలో భార్య వెంకట మాధవి(35)తో నివాసం ఉంటున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నెల 13న మాధవి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇలా ఫిర్యాదు చేస్తున్న సమయంలో తనకు ఏ విషయం తెలియనట్లుగా గురుమూర్తి అత్తామామలతో కలిసి మీర్‌పేట పోలీస్ స్టేషన్‌కి వచ్చాడు. అయితే, విచారించిన పోలీసులకు సంచలన విషయాలు తెలిసినట్లు సమాచారం. గురుమూర్తి తన భార్యను చంపిన విషయం తెలిసింది. తన భార్యని చంపడానికి ముందు కుక్కను చంపినట్లు తేలింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనలో పోలీసులు వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. అత్యంత దారుణంగా భార్యని హత్య చేసినట్లు పోలీసుల విచారణతో తేలింది. భార్యని చంపిన తర్వాత ముక్కలుగా కట్ చేశాడు. కమర్షియల్ సిలిండర్ తీసుకువచ్చి మృతదేహానికి చెందిన ముక్కలను ఉడకబెట్టి, వాటిని ఎండబెట్టి రోకలితో పొడిగా మార్చినట్లు తేలింది. మృతదేహానికి చెందిన పొడిని బకెట్‌లో తీసుకెళ్లి చెరువులో పారేశాడు. నిందితుడు గురుమూర్తి మృతదేహాన్ని పొడిగా మార్చడంతో ఆనవాళ్లు లేకుండా పోయాయి. సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు ఇంట్లోనే మృతదేహాన్ని కోసి కాల్చి వేసి బూడిద చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం మృతదేహానికి సంబంధించిన పొడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?

**హైదరాబాద్,జనవరి22 వెలుతురు :**
దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు. కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతున్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి



అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్వయసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూమలు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు లాంటి వారు ఇలాంటి ప్రయత్నాలు చేయాలి. దేశీయంగా రుణాలను ఇచ్చేందుకు పారదర్శక విధానం అమలు కావాలి. తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేలా పాలసీలను రూపొందించాలి. అప్పుడే ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. దావోస్ పర్యటనలతో డబ్బు వృధా చేసుకునే బదులు దేశీయ ఆలోచనలతో ముందుకు నడవడం అవసరం.

# టచ్ చేస్తే... సౌండ్..

**కరీంనగర్, జనవరి22 వెలుతురు :**
చోరీలకు చెక్ పెట్టేలా రామగుండం కమిషనరేట్ పోలీసులు సెన్సార్ సైరన్ లాక్ అందుబాటులోకి తెచ్చారు. ఇళ్లకు తాళాలు వేసి బయటికి వెళ్లేవారు చోరీ జరగకుండా ఉండేందుకు సెన్సార్ సైరన్ లాక్ ఏర్పాటు చేస్తే చోరీలకు చెక్ పెట్టవచ్చని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు.చోరీలకు చెక్ పెట్టేలా రామగుండం కమిషనరేట్ పోలీసులు సరికొత్త లాక్ కు తెరపైకి తెచ్చారు. సెన్సార్ సైరన్ లాక్ ను మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. ఇళ్లకు తాళాలు వేసి బయటికి వెళ్లేవారు చోరీ జరగకుండా ఉండేందుకు సెన్సార్ సైరన్ లాక్ ఏర్పాటు చేస్తే చోరీలకు చెక్ పెట్టవచ్చని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల కాలంలో ఇళ్లలో షాప్ లలో చోరీలు పెరుగుతున్నాయి. ప్రజలకు కంటి మీద కొనుకు లేకుండా చేస్తూ, పోలీసులకు దొంగలు సవాల్ గా మారారు. ఇలాంటి పరిస్థితుల్లో చోరీలను అదుపుచేసేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సెన్సార్ సైరన్ లాక్ ను మార్కెట్లోకి తీసుకువచ్చారు.చిన్న చిన్న వస్తువుల నుంచి పెద్ద వాటి వరకు ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ డివైస్ పైనే ఆధారపడి ఉంటున్నాయి. అనునిత్యం జీవన విధానంలో టెక్నాలజీ ఒక భాగంగా ఉంటుంది. సెన్సార్ సైరన్ మీ ఇంటిలోనికి ఎవరైనా చొరబడటానికి ప్రయత్నించినట్లయితే వారి ప్రయత్నాన్ని ఆపేందుకు సెన్సార్ సైరన్ మ్రోగుతుంది. అలారం శబ్దం రావడంతో చుట్టూ పక్కల వారిని కూడా అలర్ట్ చేస్తుంది. తద్వారా దొంగతనం చేయడానికి వచ్చిన వ్యక్తి భయపడి తన ప్రయత్నం విరమించుకుంటాడు. నేరాల నియంత్రణలో సాంకేతికత అవసరాన్ని ప్రజలు గుర్తించి వినియోగించుకోవాలని సీపీ కోరారు. ఇంటికి తాళాలు వేసి బయటకు, ఊర్లకు వెళ్లే వారంతా వివిధ రకాలపరికరాల సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. తద్వారా చోరీలకు పాల్పడే నిందితుల ప్రయత్నాన్ని విరామించుకొనేలా ఆకస్మికంగా వాటి నుంచి వచ్చే అలారం శబ్దంతో భయం కలిగేలా చేస్తుంది.డోర్ అలారాలు చాలా ప్రభావవంతమైన గృహ భద్రతా పరికరాలు, ఎవరైనా మీ ఇంటి తలుపులు తెరిస్తే లేదా తెరవడానికి ప్రయత్నించినప్పుడు అలారం సౌండ్ తో హెచ్చరిస్తాయి. మీరు మీ ఇంటిలోని అన్ని డోర్‌లకు (గ్యారేజ్ డోర్స్, సైడ్ బ్యాక్ డోర్స్, గ్లాస్ గార్డెన్ డోర్స్, సెల్లార్ డోర్స్, సేఫ్ డోర్స్, కార్యాలయాలు, గిడ్డంగులు, కర్మాగారాలు వంటి పారిశ్రామిక ప్రాంతాలు, నివాస గృహాలు, గ్యారేజీలు, దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లతో సహా వాణిజ్య ప్రాంగణాలు, ఏదైనా నిల్వ ఉంచే సౌకర్యాలు ఉన్న ప్రాంతంలో మొదలైనవి) డోర్, విండో అలారాలను అటాచ్ చేసుకోవచ్చు. అదేవిధంగా మీ ఇంటి చుట్టూ ఉన్న గ్రౌండ్ ఫ్లోర్ కిటికీలపై విండో అలారాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఈ అలారం సెక్యూరిటీ గ్యాడ్జెట్ అలారం సిస్టమ్, బజర్, బ్యాటరి లు లభిస్తాయి. దీనిని ఎలా ఉపయోగించాలి అనేది సొంతంగా యూట్యూబ్‌లో వీడియోలు చూసి తెలుసుకోవచ్చన్నారు. దీని బజర్ ఏకంగా 105 నుంచి 110 వరకు డీబీతో మోగుతుంది. చాలా దూరం వరకు ఈ సౌండ్ స్పష్టంగా వినిపిస్తుంది. దీంతో ఎవరైనా లాక్ ,డోర్,విండో తెరిచే ప్రయత్నం చేస్తే వెంటనే అక్కడి నుంచి పారిపోయే పరిస్థితి ఉంటుంది.అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి తదితర ఈ కామర్స్ సైట్స్‌లో ఈ యాంటీ థెఫ్ట్ అలారాలు అందుబాటులో ఉన్నాయి. ధర విషయానికొస్తే కంపెనీ బట్టి రూ. 300 నుంచి రూ. 500లో ఈ గ్యాడ్జెట్స్ అందుబాటులో ఉన్నాయి. సెన్సార్ సైరన్ లాక్ ఏ విధంగా పనిచేస్తుందో మీడియా సమావేశంలో సీపీ వివరించారు.

# కార్యదర్శి కోసం ముగ్గురు కామ్రేడ్స్ పోటీ




**నల్గొండ, జనవరి22 వెలుతురు :**
రాష్ట్ర పార్టీ కార్యదర్శి కోసం..సీపీఎం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. వరుసగా మూడు టర్మ్‌లుగా రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు తమ్మినేని వీరభద్రం. పార్టీ నిబంధనల ప్రకారం ఆయనకు మరోసారి కార్యదర్శి అయ్యే అవకాశం లేదు. దీంతో పార్టీలో చాలామంది నేతలు రాష్ట్ర కార్యదర్శి సీటుపై కన్నేశారు. దీంతో ఈసారి సీపీఎం పార్టీ రథసారధి ఎవరనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఎప్పుడూ లేని విధంగా జిల్లా కార్యదర్శుల ఎన్నిక కూడా రసవత్తరంగా సాగింది. దీంతో సీపీఎం స్టేట్ సెక్రటరీ రేసు మరింత ఉత్కంఠ రేపుతోంది.త్వరలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో జరగనున్నాయి. రాష్ట్ర మహాసభల చివరిరోజు రాష్ట్ర కొత్త సారధిని ఎన్నుకుంటారు. ప్రతి మూడేళ్లకోసారి సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తారు. ఆ సభల ద్వారానే రాష్ట్ర కార్యదర్శిని పార్టీ ప్రతినిధులు ఎన్నుకుంటారు. ఒక వ్యక్తి పార్టీ కార్యదర్శి పదవికి మూడు టర్మ్‌ల కంటే ఎక్కువ కాలం ఉండకూడదనే రూల్ సీపీఎం పార్టీ ఉంది.గ్రామ కార్యదర్శి నుంచి జాతీయ కార్యదర్శి వరకు మూడుసార్లు మాత్రమే కార్యదర్శి పదవిలో ఉండాలి. ప్రస్తుతం తెలంగాణ సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం ఉన్నారు. పార్టీ నియమం ప్రకారం తమ్మినేని టర్మ్ ముగియడంతో రాష్ట్ర కార్యదర్శి ఎవరు అవుతారనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అనారోగ్యానికి గురి అయ్యారు. అప్పటి నుంచి ఇంచార్జ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.వీరయ్య పార్టీ కార్యాలయ బాధ్యతలు చూస్తున్నారు. కొత్త కార్యదర్శి రేసులో పార్టీ సీనియర్ నేతలు ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన పోతినేని సుదర్శన్ పోటీ పడుతున్నారు. ఈసారి రాష్ట్ర కార్యదర్శి పదవి పై ఖమ్మం, నల్గొండ జిల్లా నాయకులు ఆశలు పెట్టుకున్నారు.ముఖ్యంగా నల్గొండ జిల్లా నేతలు ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారట. పార్టీ నిర్మాణంలో తమ జిల్లా పాత్ర ఉందని పార్టీ పదవుల్లో తమకు అన్యాయం జరుగుతోందని, ఈసారి చాన్స్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట. అయితే ఈ సారి జిల్లా కార్యదర్శుల ఎన్నిక రసవత్తరంగా సాగింది చాలా జిల్లాల్లో జిల్లా కార్యదర్శి ఎన్నిక కోసం ఓటింగ్ వరకు వెళ్లింది. మరి రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక కూడా ఏకగ్రీవ అవుతుందా.? లేక ఇద్దరు ముగ్గురు నేతలు పోటీ ఉంటే ఓటింగ్ జరుగుతందా అనేది ఆసక్తికరంగా మారింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పదవి ఎవరికి దక్కబోతుందనేది చూడాలి మరి.

# వీల్‌చైర్‌పై రష్మిక

## త్వరగా కోలుకోవాలని అభిమానుల పోస్టులు

నేషనల్ క్రష్ రష్మిక మందన్నకి ఇటీవలే ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రెండు వారాల క్రితం జిమ్‌లో ఎక్సర్‌సైజ్ చేస్తుండగా.. కాలికి గాయం అయింది. అప్పటి నుంచి రష్మిక ఇంట్లోనే ఉంటూ రెస్ట్ తీసుకుంటున్నారు. తాజాగా రష్మిక వీల్‌ఛైర్‌పై దర్శనమిచ్చారు. కాలికి కట్టుతో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన రష్మిక.. కారు దిగగానే వీల్‌ఛైర్‌లో కూర్చుని వెళ్లారు. ఆ సమయంలో ముఖం కనిపించకుండా మాస్క్ పెట్టుకుని, తలకు క్యాప్‌తో దర్శనమిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. వీడియో చూసిన నెటిజన్లు రష్మిక త్వరగా కోలుకోవాలంటూ కామెంట్స్ చేస్తున్నారు.





# పోక్సో కేసులో నటుడు పరారీ



పోక్సో కేసులో పరారీలో ఉన్న మలయాళ నటుడు కేఆర్ జయచంద్రన్‌పై కేరళ పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేశారంటూ ఆయనపై ఆరోపణలున్నాయి. గతేడాది కోజికోడ్‌లోని కసాబా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆయనపై కేసు నమోదైంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. లైంగిక దాడి, పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద ఆయనపై అభియోగాలను మోపారు. ఈ కేసులో అరెస్టు చేయకుండా జయచంద్రన్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. అంతకు ముందు కోజికోడ్ సెషన్స్ కోర్టు సైతం బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ క్రమంలో జయచంద్రన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధితురాలి బంధువులు కోజికోడ్ నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన పరారయ్యారు. ఈ క్రమంలోనే పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఆయన గురించి సమాచారం తెలిస్తే కోజికోడ్‌లోని కసబా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.


# ఓటీటీ వల్లనే సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి - అక్షయ్‌కుమార్

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఓటీటీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. థియేటర్‌లో వచ్చే సినిమాలు ఓటీటీ (ఓవర్ ది టాప్)ల వలనే ఫ్లాప్ అవుతున్నాయని తెలిపాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'స్కై ఫోర్స్'. ఈ సినిమాతో వీర్ పహరియా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుండగా.. సందీప్ కెవ్లానీ, అభిషేక్ కపూర్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమాను రిపబ్లిక్ డే కానుకగా జనవరి 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా ఈ సినిమా రూపొందగా.. ఇందులో సారా అలీ ఖాన్, నిమ్రత్ కౌర్ కీలక పాత్రలు పోషించారు. జియో స్టూడియోస్, మడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌లపై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మించాడు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ఇండియన్ సినిమా ప్రస్తుతం ఎందుకు ఇంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది?.. ఎందుకు సక్సెస్ రేట్ ఎందుకు ఇంత తక్కువగా ఉందని మీడియా అక్షయ్‌ని ప్రశ్నించగా.. అక్షయ్ సమాధానమిస్తూ.. ఓటీటీల వలనే సినిమాలు థియేటర్‌లో ఆడకుండా ఫ్లాప్ అవుతున్నాయని వెల్లడించాడు. నేను ఈ మధ్య కొంతమందిని కలిసినప్పుడు వారితో సినిమాల గురించి మాట్లాడాను. అయితే వారు సినిమాలు థియేటర్‌లో కాకుండా ఓటీటీలో చూస్తున్నాం అని చెబుతున్నారు. ఒక సినిమా బాక్సాఫీస్ దగ్గర రన్ అవ్వకుండా ఫ్లాప్ అవ్వడానికి ఇదే ముఖ్య కారణం. కరోనా వేవ్ తర్వాత కూడా ఓటీటీలకు అలవాటైన ప్రేక్షకులు ఇప్పుడు థియేటర్‌కి రావడం క్రమంగా తగ్గించారు. ఈ మధ్య ఈ అలవాటు బాగా పెరిగింది అని తెలిపాడు. ప్రేక్షకులు కూడా ఈ మధ్య సెలక్టివ్‌గా సినిమాలు చూస్తున్నారు. వారికి సినిమా నచ్చితేనే థియేటర్‌కి వెళు తున్నారు. లేకుంటే అదే సినిమాను ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేసి చూస్తున్నారు అంటూ అక్షయ్ చెప్పుకోచ్చాడు.



# రెండో రోజూ కొనసాగుతున్న ఐటీ సోదాలు


### సుకుమార్ ఇంటితోపాటు కార్యాలయాల్లోనూ సోదాలు


హైదరాబాద్‌లో రెండో రోజూ ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నివాసాలు, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఆఫీసుతోపాటు మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసిందే. తాజాగా పుష్ప 2 డైరెక్టర్ సుకుమార్ ఇంటితోపాటు ఆఫీసులో కూడా తనిఖీలు చేపట్టారు. పుష్ప 2 సినిమాకు సుకుమార్ తీసుకున్న రెమ్యునరేషన్, ఆదాయ వనరులు తదితర డాక్యుమెంట్లను పరిశీలించారు. పుష్ప 2కు సుకుమార్ తీసుకున్న రెమ్యునరేషన్.. ఇందుకు సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపులపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. ఐటీ అధికారులు ఇప్పటికే మంగళవారం ఉదయం నుంచే హైదరాబాద్‌లోని 8 చోట్ల ఏకకాలంలో 55 బృందాలు దాడులు చేపట్టారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఐటీ అధికారులు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ , మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థలు ఆయా సినిమాలకు పెట్టిన పెట్టుబడులు, ఆదాయాలపై ఆరాతీసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే సినిమాలకు పెట్టుబడులు.. వచ్చిన ఆదాయం ఇతర విషయాలపై దిల్ రాజును ప్రశ్నించగా.. తాను విజయ్‌తో తెరకెక్కించిన వారిసు (వారసుడు) సినిమా రూ.120 కోట్లు మాత్రమే వసూళ్లు చేసిందని దిల్ రాజు ఐటీ అధికారులకు చెప్పినట్టు తెలుస్తోంది. అంతేకాదు విజయ్‌కు రూ.40 కోట్లు రెమ్యునరేషన్ ఇచ్చాం. ఈ సినిమాకు వచ్చిన నష్టాలను పూడ్చేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు రూ.60 కోట్ల నష్టపరిహారం చెల్లించామని చెప్పినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

# వీరధీరసూరన్‌లో విక్రమ్ బిజీబిజీ

కోలీవుడ్ స్టార్ యాక్టర్ చియాన్ విక్రమ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ స్టార్ హీరో నటిస్తున్న చిత్రాల్లో ఒకటి వీరధీరసూరన్. ఛియాన్ 62 ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ మూవీకి చిత్త (చిన్నా) ఫేం ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఎక్జయిటింగ్ అప్‌డేట్ అందించబోతున్నారంటూ యాక్టర్ కమ్ ప్రొడ్యూసర్ రియా ఓ సెల్ఫీ వీడియో షేర్ చేసింది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుదల తేదీయే అయి ఉంటుందని అంతా చర్చించుకుంటుండగా.. దీనిపై మరికొన్ని గంటల్లోనే క్లారిటీ రానుంది. క్యూట్ క్యూట్‌గా సాగుతున్న రియా సెల్ఫీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే లాంచ్ చేసిన వీరధీరసూరన్ టైటిల్ టీజర్ పక్కా యాక్షన్ ప్యాక్‌డ్ కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తెలియజేస్తుంది. ఈ చిత్రాన్ని ఏపీలో శ్రీలక్ష్మి మూవీస్, తెలంగాణలో ఎన్‌వీఆర్ బ్యానర్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మూవీలో కోలీవుడ్ భామ దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# ఆటోడ్రైవర్‌ను కలిసిన సైఫ్


ముంబైలో ఈ నెల 16న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై తన ఇంట్లో ఓ దుండగుడు కత్తితో దాడి చేశాడని తెలిసిందే. తెల్లవారుజామున 2 గంటలకు ఇంట్లో దాడి జరగ్గా.. అతన్ని 3.30 నిమిషాలకు లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటన జరిగిన సమయంలో తనను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడిన ఆటోడ్రైవర్ భజన్ సింగ్ రానాను సైఫ్ అలీ ఖాన్ కలిశాడు. దాడి జరిగిన సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లి తనను కాపాడిన భజన్ సింగ్ రానాకు కృతజ్ఞతలు తెలియజేశాడు సైఫ్ అలీఖాన్. భజన్ సింగ్‌తో సైఫ్ అలీఖాన్ దిగిన ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. దాడి జరిగిన సమయంలో సైఫ్ అలీ ఖాన్ రక్తంతో తడిసిపోయాడని, నడవలేని స్థితిలో ఉన్నాడని ఆటో డ్రైవర్ భజన్ సింగ్ ఇప్పటికే మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. సైఫ్ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తన వద్ద ఉన్న పదునైన ఆయుధంతో హీరోను పొడిచాడు. సుమారు ఆరు చోట్ల బలమైన కత్తిపోట్లు ఉన్నట్లు లీలావతి ఆస్పత్రి డాక్టర్లు చెప్పారు. రెండు చోట్ల మాత్రం ఆ కత్తి పోట్లు చాలా డీప్‌గా ఉన్నాయని.. ఒక కత్తిపోటు సైఫ్ వెన్నుపూస సమీపంలో డీప్‌గా దిగినట్లు చెప్పారు. మెడ, చేయి, వెన్నులో ఓ పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు తెలిపారు. వెన్నులో దిగిన వస్తువును సర్జరీ ద్వారా తొలగించినట్లు వెల్లడించారు.



# తమిళ యాక్టర్లు ఎప్పుడూ సిద్ధంగా ఉండరు

### నేనిక్కడ పనిచేయకపోవచ్చు - గౌతమ్ వాసుదేవ్ మీనన్

తెలుగు, తమిళం, మలయాళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని సెలబ్రిటీ గౌతమ్ వాసుదేవ్ మీనన్. యాక్టర్‌గా, స్క్రీన్ రైటర్‌గా, డైరెక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా ఇండస్ట్రీలో సక్సెస్‌ఫుల్‌గా ప్రయాణాన్ని సాగిస్తున్నాడు. ఈ టాలెంటెడ్ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మలయాళ చిత్రం డొమినిక్ అండ్ ది లేడీస్ పర్స్. మమ్ముట్టి లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ మూవీ జనవరి 23న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు గౌతమ్ మీనన్. నిజం చెప్పాలంటే సినిమాలకు భారీ బడ్జెట్ అవసరం లేదు. మంచి కంటెంట్ అనేది పరిగణలోకి వస్తుంది. రూ.100 కోట్ల సినిమాలు తెరకెక్కించేందుకు బదులు రూ.10 కోట్ల బడ్జెట్‌తో పది సినిమాలు నిర్మించడంపై ఫోకస్ పెట్టాలన్నాడు. చాలా మంది తమిళ యాక్టర్లు స్క్రిప్ట్‌తో సంబంధం లేకుండా హై బడ్జెట్ సినిమాలపై పనిచేసేందుకు ఇష్టపడుతుంటారన్నాడు గౌతమ్ మీనన్. నాకొక అవకాశం ఇస్తే.. కథలతో మొదలు.. ప్రతీ విషయాన్ని మాలీవుడ్‌కు తీసుకొస్తా. ఆ కథల్లో సగానికిపైగా సినిమాలు తమిళంలో తెరకెక్కించబడవు. ఒక సినిమా మలయాళంలో సక్సెస్ అయితే దాన్ని కోలీవుడ్‌లో రీమేక్ చేస్తారు. కానీ తమిళ యాక్టర్లు మాత్రం అలాంటి ఒరిజినల్ స్క్రిప్ట్‌ను చేసేందుకు ఎప్పుడూ ఒకే చెప్పరు. ఈ ప్రకటన తర్వాత నేను తమిళ సినిమాల్లో పనిచేయలేకపోవచ్చుంటూ కోలీవుడ్‌లో ఉన్న పరిస్థితుల గురించి చెప్పుకొచ్చాడు గౌతమ్ మీనన్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# సైఫ్ అలీఖాన్ భద్రత పటిష్ట భద్రత

### పాపులర్ బాలీవుడ్ యాక్టర్ రోనిత్‌రాయ్ సెక్యూరిటీ ఏజెన్సీకి అప్పగింత

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సైఫ్ అలీఖాన్‌పై ఈనెల 16న దాడి జరిగిన విషయం తెలిసిందే. నిందితుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ సైఫ్ అలీఖాన్ ఇంటికి చోరీకి వెళ్లి అతడిపై ఆరుసార్లు కత్తితో పొడిచాడు. కుటుంబసభ్యులు సైఫ్‌ను ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో చేర్పించగా.. ఆరు రోజుల చికిత్స అనంతరం మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. వారం పాటు పూర్తి బెడ్ రెస్ట్ తీసుకోవాలని సైఫ్‌కు డాక్టర్లు సూచించారు. ఈ నేపథ్యంలో సైఫ్ అలీఖాన్ ఇంటి వద్ద సెక్యూరిటీ కట్టుదిట్టం చేశారు. తాజా కథనాల ప్రకారం సైఫ్ అలీఖాన్ ఫ్యామిలీ భద్రత కోసం పాపులర్ బాలీవుడ్ యాక్టర్ రోనిత్ రాయ్ సెక్యూరిటీ ఏజెన్సీని నియమించుకుంది. రోనిత్ రాయ్ సైఫ్ అలీఖాన్ అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకుని పర్సనల్‌గా భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నట్టు బీటౌన్ సర్కిల్ టాక్. రోనిత్ రాయ్ ఏజెన్సీ ఇప్పటికే బాలీవుడ్ స్టార్ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, అమీర్‌ఖాన్ భద్రతను చూసుకుంటుంది.

## మళ్లీ ప్రారంభించేశారు..
# లోకేష్ భజన బ్యాచ్

విజయవాడ, జనవరి 22 వెలుతురు:




ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కాకముందే టీడీపీ నేతల టోన్ మారింది. నారా లోకేష్ ను ఉప ముఖ్యమంత్రిగా చేయాలని నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇది ఒకరకంగా భజన కార్యక్రమేనని పార్టీ కార్యకర్తలు ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. పదవుల కోసం నారా లోకేష్ ప్రాపకం కోసం ఈ రకమైన ప్రతిపాదనను తెస్తున్నారంటూ సోషల్ మీడియాలో టీడీపీ క్యాడర్ నుంచే కామెంట్స్ వినపడుతున్నాయి. నిజానికి కూటమి ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు. అనేక సవాళ్లు ముందున్నాయి. ఈ సమయంలో ఇలాంటి చర్చకు తెరతీయడం అంటే కేవలం విదితలు వేసే కార్యక్రమమేనంటూ కొందరు పోస్టులు పెడుతున్నా రు. ఈ డిమాండ్ పై అప్పుడే జనసేన నేతలు స్పందిస్తున్నారు. తమ నేత పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రిగా చేయాలని, కేంద్రమంత్రిగా చంద్రబాబు వెళ్లాలని వారు సూచిస్తున్నారు. నారా లోకేష్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పదవికి అనర్హుడు కాదని కాదు. కానీ ఆయనకు చాలా వయసు ఉంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ ఉన్నారు. లోకేష్ కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తే ఖచ్చితంగా జనసేన నేతలు నొచ్చుకుం టారు. అదే సమయంలో పవన్ కల్యాణ్ ఆలోచనల్లో కూడా మార్పు వచ్చే అవకాశముంది. కూటమి ప్రభుత్వం మరోసారి ఏర్పడాలని చంద్రబా బు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు కూడా కూటమితోనే వెళ్లాలన్నది చంద్రబాబు ఆలోచన. అయితే దానికి గండికొట్టే విధంగా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారని క్యాడర్ భావిస్తుంది. సీనియర్ నేతలే ఇలా వ్యాఖ్యానిస్తుంటే ఇక కొత్తగా వచ్చే నేతల పరిస్థితి ఏంటన్న చర్చ పార్టీలో మొదలయింది. స్మూత్ గా వెళ్లే పాలిటిక్స్ ను సీనియర్ నేతలు చేజేతులా పక్కదారిపట్టించేలా ఉండటున్నారు నిజానికి నారా లోకేష్ కు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా లేకపోయినప్పటికీ ఆయన అంతా తానే అయి వ్యవహరిస్తున్నారు. ఆయన మాట కాదని ఏ శాఖలో కూడా అధికారులు పనులు చేయని పరిస్థితి. అలాంటి సమయంలో మిత్రులతో వైరం పెంచుకునేలా ఇలాంటి వ్యాఖ్యానాలు పార్టీకి రాజకీయంగా ఇబ్బంది కలిస్తాయని అంటున్నారు. ఒకవేళ నిజంగా లోకేష్ ను ఉప ముఖ్యమం త్రిగా చేస్తే పవన్ కల్యాణ్ నొచ్చుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పవన్ ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే అవకాశముంది. 2029 ఎన్నికల్లో గెలిస్తే అప్పుడు ఈ ప్రతిపాదన తెచ్చినా అర్థముందని, ఇప్పుడు ఈ డిమాండ్ తెచ్చి కొన్ని వర్గాలను కావాలని దూరం చేసుకునేలా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. తొలుత కడప జిల్లా నేత శ్రీనివాసరెడ్డి ఈ ప్రతిపాదనను బహిరంగ సభలోనే చేశారు. ఆయన కూడా తన భార్యకు మంత్రి పదవి కోసమే చేశారని సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడుకు ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకోవా లో తెలుసు. ఒకరు చెప్పినంత మాత్రాన, డిమాండ్ చేసినంత మాత్రాన తలొగ్గరు. ఇక తాజాగా డిప్యూటీ సీఎం పదవికి నారాలోకేష్ అర్హుడంటూ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా ఇదే రకమైన ప్రకటన చేశారు. ఆయన కూడా మంత్రి పదవి కోసమే ఈ రకమైన కామెంట్స్ చేస్తున్నారం టున్నారు. డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రతిపాదనను సమర్థిస్తున్నానని, యువగళం పాదయాత్రతో నాయకత్వాన్ని నిరూపించుకున్నారని, లోకేష్ నాయకత్వానికి ప్రజామోదం జైకొట్టిందని, లోకేష్ పేరును పరిశీలించాలని కోరుతున్నానని సోమిరెడ్డి భజన కార్యక్రమం బిగన్ చేశారు. ఇది రాజకీయంగా తగదన్న సూచనలు వినిపిస్తున్నాయి.ం

## ఎనిమిదేళ్ల వయస్సు నుంచే ప్రకృతి అంటే ఆసక్తి

- 70 ఎకరాల్లో అడవి సృష్టించి.. జీవరాశులకు ఆవాసం..
- గవర్నర్ ప్రతిభా పురస్కారానికి ఎంపికైన దుశ్చర్ల సత్యనారాయణ

సూర్యపేట, జనవరి 22 వెలుతురు:




సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవపురానికి చెందిన దుశ్చర్ల సత్యనారాయణకు ఎనిమిదేళ్ల వయస్సు నుంచే ప్రకృతి అంటే ఆసక్తి. బ్యాంక్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన దుశ్చర్ల సత్యనారాయణ.. ప్రకృతిపై ఉన్న ప్రేమతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. నల్లగొండ జిల్లాను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యపై జల సాధన పేరుతో ఉద్యమించిన దుశ్చర్ల సత్యనారాయణ.. వారసత్వంగా తనకు వచ్చిన 70 ఎకరాల భూమిని అరు దశాబ్దాల శ్రమించి అడవిని సృష్టించారు. మూగ జీవాలకు ఆవాసంగా.. జీవరాశులకు ఆహారం, నీళ్లు అందించేలా అడవిగా మార్చారు. అడవిలో పక్షులు, జంతువులకు ఉపయోగపడే పంటలను సాగుచేశారు. భూగర్భ జలాల పెంపు, జంతువులు, పక్షుల తాగునీటికి 7 ప్రాంతాల్లో కుంటలు తవ్వించారు. కొన్ని చోట్ల బోర్లు వేయించారు. అడవిల్లో మాదిరిగా ఉండే పలు రకాల పక్షులు, జంతువులకు ఆవాసంగా ఈ అడవిని మార్చి జీవ వైవిధ్యానికి జీవం పోస్తూ పర్యావరణ వేత్తగా అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రకృతిని కాపాడుతూ 70 ఎకరాల్లో అడవిని సృష్టించిన పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణకు అనేక అవార్డులు వరించాయి. ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మకమైన ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్‌లో నాలుగో నది ఉత్సవంలో పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణపై "ఇండియాన్ గ్రీన్‌హార్ట్ దుశ్చర్ల సత్యనారాయణ" అనే డాక్యుమెంటరీ ప్రదర్శించారు. తాజాగా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆరుగురిని రాజ్‌భవన్ వర్గాలు ఎంపిక చేశాయి. వారిలో సత్యనారాయణ ఒకరు. ఈ నెల 26న రాజ్‌భవన్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవంలో దుశ్చర్ల సత్యనారాయణకు తెలంగాణ గవర్నర్–2024 అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్‌తో పాటు రూ.2లక్షల నగదును గవర్నర్ జిష్ణుదేవవర్మ అందజేస్తారు. ఈ సందర్భంగా దుశ్చర్ల సత్య నారాయణ మాట్లాడుతూ ఈ అవార్డు ఎంపికతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

# కుబేరుల బొజ్జలు నిండుతున్నాయ్

- ట్రిలియనీర్లుగా మారుతున్న బిలియనీర్లు
- సంపదే కాదు.. పేత్తనమూ పెరుగుతోంది
- దిగజారుతున్న పేదల బతుకులు
- ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ జనవరి 22 వెలుతురు:



ప్రపంచంలో కోటీశ్వరుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. 2023తో పోలిస్తే గత సంవత్సరం వారి సంపద రెండు ట్రిలియన్ డాలర్లు పెరిగి పదిహేను ట్రిలియన్ డాలర్లకు చేరింది.అంటే 2023లో కంటే2024లో వారిసంపద మూడు రెట్లు పెరిగిందన్న మాట. ప్రపంచంలోని కుబేరులందరూ సోమవారం కొలరాడోలోని స్కై రిసార్ట్ పట్టణంలో వార్షిక సమావేశం నిర్వహించా రు. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరులపై ఓ ఆసక్తికరమైన అధ్యయనం వెలుగు చూసింది. ప్రతి ఏటా ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సమావేశం ప్రారంభమయ్యే రోజు ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సంస్థ అసమానతలపై ఓ నివేదిక విడుదల చేస్తోంది. 1990 నుండి పేదల సంఖ్యలో ఎలాంటి మార్పు రానప్పటికీ కోటీశ్వ రుల సంపద మాత్రం అమాంతం పెరిగిపోతోందని ఈ నివేదిక తెలిపింది. గత సంవత్సరం ఆసియాలో కుబేరుల సంపద ఏకంగా 299 బిలియన్ డాలర్లు పెరిగిందని, రాబోయే దశాబ్ద కాలంలో కనీసం ఐదుగురు ట్రిలియనీర్లు ఉంటారని ఆక్స్‌ఫామ్ చెబుతోంది.

పెరుగుతున్న కోటీశ్వరుల జాబితా: ప్రపంచ కోటీశ్వరుల జాబితాలో గత సంవత్సరం 204 మంది చేరారు. అంటే ప్రతి వారానికి సగటున సుమారు నలుగురు వ్యక్తులు కుబేరులు అవుతున్నారన్న మాట. గత సంవత్సరం ఒక్క ఆసియాలోనే కోటీశ్వరుల జాబితాలో కొత్తగా 41 మంది చేరారు. ఉత్తర అమెరికా, యూరప్‌లోని సంపన్న, శక్తివంతమైన దేశాలలో నివసిస్తున్న ఒక శాతం కుబేరులు 2023వ సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థల ద్వారా యూరప్, ఉత్తర అమెరికా వెలుపల ఉన్న ప్రాంతాల నుండి గంటకు 30 మిలియన్ డాలర్లు కొల్లగొట్టారని ఆక్స్‌ఫామ్ తన నివేదికలో తెలియజేసింది. కోటీశ్వరుల సంపదలో 60 శాతం వారసత్వం, గుత్తాధిపత్యం, క్రోనీ సంబంధాల నుండి పొందినదేనని 'టేకర్స్‌ఔ% నాట్ మేకర్స్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఆక్స్‌ఫామ్ ఎత్తిచూపింది. అత్యంత సంపన్నులైన వారి ఆర్జనలో ఎక్కువభాగం గౌరవప్రదంగా పొందిందేమీ కాదని అంటూ అసమానతలను తగ్గించేందుకు, అధిక సంపదకు స్వస్తి పలికేందుకు, కొత్తగా పుట్టుకొచ్చిన దొరతనాన్ని అంతం చేసేందుకు వీలుగా ప్రపంచంలోని కుబేరులపై ఆయా దేశాల ప్రభుత్వాలు పన్నులు విధించాలని హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పెత్తనమూ పెరుగుతోంది: గత ఏడాది కుబేరుల సంపద రోజుకు సగటున 5.7 బిలియన్ డాలర్ల చొప్పున పెరిగింది. 2023లో బిలియనీర్ల సంఖ్య 2,565 నుండి 2,769కి పెరిగింది. ప్రపంచంలో అత్యంత సంపన్నులైన పది మంది సంపద రోజుకు సగటున వంద మిలియన్ డాలర్ల చొప్పున పెరిగింది. ఒకవేళ వారు రాత్రికి రాత్రే తమ సంపదలో 99 శాతాన్ని కోల్పోయినప్పటికీ వారు కోటీశ్వరులుగానే మిగులుతారని ఆక్స్‌ఫామ్ తెల్పి చెప్పింది. నేడు అసమానతలు గరిష్ట స్థాయికి చేరడం వెనుక అక్రమ సంపద, వలసవాదం శక్తివంతంగా పనిచేస్తున్నాయి. కోటీశ్వరుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరగడానికి కూడా ఇదే కారణం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం కొందరి చేతిలో బందీగా ఉండిపోయింది. బిలియనీర్లకు అడ్డుకట్ట వేయడంలో జరుగుతున్న వైఫల్యం కారణంగా ట్రిలియనీర్లు పుట్టుకొస్తున్నారు. కోటీశ్వరుల సంపద మాత్రమే పెరగడం లేదు.. దానితో పాటు వారి పెత్తనం కూడా పెరుగుతోందని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహార్ చెప్పారు. 'కుబేరుడైన దేశాధ్యక్షుడు. ఆయనను తీసుకొచ్చి మద్దతు ఇచ్చిన ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తి ఎలాన్ మస్క్. ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థను నడపబోతున్నారు. మేము ఈ నివేదికను ఒక మేలుకొలుపుగా అందిస్తున్నాము. కొద్దిమంది చేతిలో ఉన్న అంతులేని సంపద కారణంగా ప్రపంచంలోని సామాన్య ప్రజలు నలిగిపోతున్నారు' అని అమితాబ్ బెహార్ తెలిపారు.

వారసత్వంగా వచ్చిందే: ఆక్స్‌ఫామ్ అంచనా ప్రకారం కోటీశ్వరుల సంపదలో 36 శాతం వారసత్వంగా వచ్చి పడిందే. 30 సంవత్సరాల లోపు వయసున్న ప్రతి కోటీశ్వరుడికీ సంపద వారసత్వంగానే సంక్రమించిందని ఫోర్బ్స్ పరిశోధన తేల్చింది. ఇవాళ కోటీశ్వరులుగా ఉన్న వెయ్యి మంది రాబోయే రెండు మూడు దశాబ్దాలలో 5.2 ట్రిలియన్ డాలర్ల సంపదను తమ వారసులకు అప్పగిస్తారని యుబిఎస్ అనే అంతర్జాతీయ సంస్థ అంచనా. యూరప్‌లోని అత్యంత సంపన్నులు పేద దేశాలను దోచుకోవడం, చారిత్రక వలసవాదం కారణంగా కుబేరులయ్యారని ఆక్స్‌ఫామ్ తెలిపింది.

ధనిక దేశాల ఆధిపత్యం: అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి ధనిక దేశాలు 69 శాతం ప్రపంచ సంపద పైన, 77 శాతం కోటీశ్వరుల సంపద పైన పెత్తనం చెలాయిస్తున్నాయి. ప్రపంచ కుబేరుల్లో 68 శాతం సంపన్న దేశాలలో నివసిస్తున్న వారే. అయితే ప్రపంచ జనాభాలో వారి సంఖ్య కేవలం 21 శాతమే. విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం ప్రతి దేశంలోనూ డబ్బు అవసరమవుతుంది. కానీ ఆ సొమ్ము సంపన్నుల బ్యాంక్ ఖాతాలకు చేరుతోంది. ఇది ఆర్థిక వ్యవస్థకే కాకుండా మానవ జాతికి కూడా నష్టదాయకమేనని బెహార్ తెలిపారు. రోజుకు కేవలం 6.85 డాలర్లతో జీవిస్తున్న వారి సంఖ్యలో 1990 నుండి పెద్దగా మార్పేమీ రాలేదని ప్రపంచ బ్యాంక్ చెబుతోంది. అయితే కోవిడ్ సమయంలో.. అంటే 2021లో కూడా కోటీశ్వరుల సంపద 5.8 ట్రిలియన్ డాలర్ల మేర పెరిగింది.

# రాష్ట్రంలో మల్టీలెవల్ మోసాల జోరు..

- గొలుసుకట్టు వ్యాపారం పేరుతో కేటుగాళ్ల ఆగడాలు
- సోషల్ మీడియా ద్వారా అమాయకులకు వల

హైదరాబాద్, జనవరి 22 వెలుతురు:



రాష్ట్రంలో మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు మళ్లీ పెరుగుతున్నాయి. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, హెర్బల్, హెల్త్‌కేర్, గృహోపకరణాలు, క్రిప్టో కరెన్సీ అమ్మకాల పేరిట పిరమిడ్ తరహాలో ఈ మోసాలు జరుగుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని, ఎంత మంది ఏజెంట్లను చేర్పిస్తే అన్ని రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశచూపు తున్నారు. దీంతో ముందూ వెనుకా ఆలోచించకుండా ఎంతో మంది అత్యాశకు పోయి భారీగా నష్టపోతున్నారు. ఇలాంటి ఉదంతాలు నానాటికీ పెరుగుతుండటంతో మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

సైబర్ మోసగాళ్ల కొత్త పన్నాగం: సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో కేటుగాళ్లు మల్టీలెవల్ మార్కెటింగ్‌పై కన్నేశారని, గొలుసుకట్టు వ్యాపారం పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు గుప్పించి అమాయకులను మోసగిస్తున్నట్టు తెలుస్తున్నది. మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీములను నడిపే కేటుగాళ్లలో చాలా మంది విదేశాల్లోనే ఉండి పిరమిడ్ రాకెట్‌ను నడుపుతున్నారని, భారీ లాభాలతోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వల వేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు.

అత్యాశకుపోతే మోసపోవుడే!: శిఖా గోయెల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ: అతి తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమేనని గ్రహించాలి. లేకుంటే మిమ్మల్ని రొంపిలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు. అత్యాశకుపోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్‌లో తొలుత చేరిన వారికే లాభాలు వస్తాయి. ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్‌వర్క్‌లలో ఎవరూ చేరొద్దు. ఆయా నెట్‌వర్క్‌ల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరూ వెళ్లొద్దు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద ప్రకటనలు, వెబ్‌లింకులు, ఏపీకే ఫైల్స్ జోలికి వెళ్లొద్దు. మోసపూరిత ప్రకటనలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 ద్వారా లేదా వాట్సప్ నంబర్ 8712672222 ద్వారా ఫిర్యాదు చేయండి.

# వేమిరెడ్డి రూట్ మారుతోందా...

నెల్లూరు, జనవరి 22 వెలుతురు:

నెల్లూరు జిల్లాలో బలమైన నేతగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆవిర్భవించారు. 2019 ఎన్నికలకు ముందే జగన్ పార్టీలో ఆయన చేరి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తర్వాత 2019 నుంచి 2024 వరకూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వైసీపీలో కీలకంగానే వ్యవహరించారు. రాయలసీమలోని కొన్ని జిల్లాలకు జగన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని సమన్వయ కర్తగా కూడా నియమించారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి నెల్లూరు జిల్లాలో మంచి పేరుంది. ఆయన తన సేవా కార్యక్రమాలతో జనంలో పాపులర్ అయ్యారు. దీనికి తోడు ఆర్థికంగా బలమైన కుటుంబం కావడం కూడా జగన్ పార్టీ చేరదీసిందనే చెప్పాలి. అయితే వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి 2024 ఎన్నికలకు ముందు వరకూ వైసీపీలో ఉన్నా తర్వాత ఆయన అందులో కంఫర్ట్ గా లేరు.తాను చెప్పిన వారికే నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో శాసనసభ సీట్లు ఇవ్వాలని జగన్ వద్ద షరతు పెట్టారు. అయితే అందుకు జగన్ అంగీకరించలేదు. దీంతో వెంటనే వేమిరెడ్డి జగన్ ను వదలి జెండా మార్చారు. నెల్లూరులో అప్పటికే బలహీనంగా ఉన్న టీడీపీ వేమిరెడ్డిని సాదరంగా ఆహ్వానించింది. ఆయనకు నెల్లూరు పార్లమెంటు సీటు, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కోవూరు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చారు. ఇద్దరూ మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి టీటీడీ పాలకమండలిలో సభ్యురాలిగా కూడా నియమించారు. అయినా వేమిరెడ్డిలో ఎక్కడో ఏదో తేడా కొట్టినట్లు కనిపిస్తుంది. నిన్న ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా ఈ విషయం స్పష్టమయింది. టీడీపీ స్థానిక నేతలకు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి మధ్య సఖ్యత లేదని గత కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. అనేక విషయాల్లో అభిప్రాయ బేధాలు నేతలతో ఆయనకు ఉన్నట్లు కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. కానీ ఇద్దరూ వైసీపీ నుంచి వచ్చారు కనుక టీడీపీలో తమకు ప్రాధాన్యత దక్కుతుందని భావించారేమో. కానీ వారు ఆశించినంత ప్రయారిటీ లభించకపోవడం, లోకల్ టీడీపీ లీడర్లు పెత్తనం చేస్తుండటం వేమిరెడ్డి వర్గాన్ని కొంత ఇరుకున పెట్టిందంటున్నారు. అందుకే వేమిరెడ్డి గత కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్నారని టీడీపీ అనుకూల మీడియాలోనే వార్తలు వచ్చాయి. అయితే పార్టీ నుంచి వెళ్లి పోయే పరిస్థితుల్లో లేరని అందరూ సరిపెట్టుకున్నారు. అధినాయకత్వం కూడా దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. తాజాగా ఎన్టీఆర్ వర్థంతి రోజున ఈ విషయం మరోసారి స్పష్టమయింది. ఆంధ్రప్రదేశ్ లో మీడియా రెండు వర్గాలుగా విడిపోయిన సంగతి అందరికీ తెలిసిందే. ప్రముఖ పత్రికలు చంద్రబాబుకు మద్దతు పలుకుతుండగా, సాక్షి సొంత పత్రిక కావడంతో సహజంగా జగన్ వైపే ఉంటుంది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడమే ఈ పత్రికల్లో చూస్తుంటాం. అంతేకాదు.. ఒకరికి సంబంధించిన ప్రకటనలు మరొకరికి ఇచ్చే పరిస్థితి కూడా లేదు. కానీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా సాక్షికి ఫుల్ పేజీ యాడ్ ఇవ్వడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. చర్చ మాత్రమే కాదు దుమారమే రేపాయి. సాక్షిలో కూడా ఈ ప్రకటన ప్రధానంగా ప్రచురితం కావడంతో అనేక అనుమానాలు తావిస్తున్నాయి. ప్రకటనలో లోకేష్, చంద్రబాబును పొగడుతూ ఇచ్చిన ప్రకటన చేసినప్పటికీ అది సాక్షిలో రావడమే ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది. వేమిరెడ్డిపై పార్టీ నేతల్లో మరింత అనుమానాలు పెరగడానికి కారణమయ్యాయని పార్టీ వర్గాలనుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com